navajyothinews.com

# నవజ్యోతి

తెలుగు దినపత్రిక




## సిద్దిపేట యాత్రపై హరీశ్‌రావు విమర్శలు




## కుల వివక్ష నిర్మూలనకు ఆలోచనా విధానం మారాలి

ప్రచురణ : తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ | శనివారం, 19 సెప్టెంబరు 2026 | ఎడిటర్ : మన్నె లక్ష్మణ్ | సంపుటి : 1 సంచిక : 327 | పేజీలు : 8 | వెల : 5/-

# తీర భద్రతకు..

### కృత్రిమ మేధతో సామర్థ్యాల విస్తరణ

### ఆత్మనిర్భర్ లక్ష్యాలకు ప్రాధాన్యత

# సాంకేతిక బలోపేతం

## సంయుక్త కార్యాచరణపై సీడీఎస్ పిలుపు



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 18 (నవజ్యోతి ప్రతినిధి)** భారత తీర రక్షక దళాన్ని భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దేందుకు సంయుక్త కార్యాచరణ, స్వావలంబన, సాంకేతిక ఆవిష్కరణలకు ప్రాధాన్యత ఇవ్వాలని చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ జనరల్ ఎన్.ఎస్. రాజా సుబ్రమణి సూచించారు. న్యూఢిల్లీలో నిర్వహించిన 43వ తీర రక్షక దళ కమాండర్ల సదస్సులో పాల్గొని ఉన్నతాధికారులను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. దేశ సముద్ర భద్రతను మరింత పటిష్టం చేయాలంటే సాయుధ దళాలు, తీర రక్షక దళం మధ్య సమన్వయం మరింత బలోపేతం కావాలని ఆయన పేర్కొన్నారు. సముద్ర సరిహద్దుల భద్రత, నిఘా వ్యవస్థలు, అత్యవసర ప్రతిస్పందన సామర్థ్యాలను పెంచడంలో సంయుక్త కార్యాచరణ కీలక పాత్ర పోషిస్తుందని వివరించారు. భద్రతా సవాళ్లు వేగంగా మారుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో సమగ్ర వ్యూహాలతో ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నారు. కృత్రిమ మేధ, ఆధునిక సాంకేతికతలను తీర రక్షక దళ కార్యకలాపాల్లో వేగంగా వినియోగించుకోవాలని జనరల్ రాజా సుబ్రమణి సూచించారు. సమాచార సేకరణ, సముద్ర పర్యవేక్షణ, ప్రమాదాల గుర్తింపు, రక్షణ చర్యల్లో కృత్రిమ మేధ వినియోగం సామర్థ్యాన్ని పెంచుతుందని తెలిపారు. భవిష్యత్ భద్రతా అవసరాలకు అనుగుణంగా సాంకేతిక ఆధారిత వ్యవస్థలను అభివృద్ధి చేయాలని పిలుపునిచ్చారు. ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యాలకు అనుగుణంగా దేశీయంగా రక్షణ పరికరాలు, సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేయడం అత్యంత అవసరమని ఆయన పేర్కొన్నారు.

(మిగతా.. 2లో)



### 22-ఏ సమస్యల

## పరిష్కారానికి కమిటీ

- పొంగులేటి శ్రీనివాస రెడ్డి కీలక ప్రకటన
- ఫాస్ట్ ట్రాక్‌లో దరఖాస్తుల పరిష్కారం
- 118 జీవో ప్రకారం రెగ్యులరైజేషన్ ప్రారంభం
- ఎల్‌బీ నగర్‌లో 9,700 ప్లాట్లకు ఊరట

హైదరాబాద్, సెప్టెంబర్ 18 (నవజ్యోతి ప్రతినిధి) 22-ఏకు సంబంధించిన సమస్యలను ఫాస్ట్ ట్రాక్ పద్ధతిలో పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసినట్లు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి శాసనసభలో ప్రకటించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శాసనసభలో చేసిన ప్రకటనకు అనుగుణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఇందుకు సంబంధించిన జీవో ఆర్.టి. నంబర్ 564ను ప్రభుత్వం జారీ చేసినట్లు వెల్లడించారు. ఈ కమిటీకి ప్రధాన భూ పరిపాలన కమిషనర్ డి.ఎస్. లోకేష్ కుమార్ చైర్మన్‌గా వ్యవహరించనున్నారు. న్యాయ శాఖ కార్యదర్శి, స్టాంపులు మరియు రిజిస్ట్రేషన్ల శాఖ

(మిగతా.. 2లో)



# ఫార్ములా-ఈ కేసుపై కేటీఆర్ ఫైర్

- నాంపల్లి ఏసీబీ కోర్టులో విచారణ
- కాంగ్రెస్ ప్రభుత్వంపై కేటీఆర్ విమర్శలు
- నవీన్ రెడ్డితో కలిసి కోర్టుకు హాజరు
- న్యాయస్థానంలోనే పోరాడతామని స్పష్టం

హైదరాబాద్, సెప్టెంబర్ 18 (నవజ్యోతి ప్రతినిధి) ఫార్ములా-ఈ వ్యవహారానికి సంబంధించిన కేసు విచారణ సందర్భంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నాంపల్లి ఏసీబీ కోర్టుకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో పాటు ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి కూడా పాల్గొన్నారు. కోర్టు పరిసరాల్లో మీడియాతో మాట్లాడిన కేటీఆర్, తమపై నమోదైన కేసులపై స్పందిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వ తీరును తీవ్రంగా విమర్శించారు. తమపై నమోదు చేసిన కేసులు రాజకీయ కక్షసాధింపు చర్యల్లో భాగమని కేటీఆర్ ఆరోపించారు. పచ్చి అబద్ధాలు, తప్పుడు ప్రచారాలతో కాంగ్రెస్ నాయకులు ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిన తమ ప్రభుత్వంపై అనవసర ఆరోపణలు చేసి రాజకీయ లబ్ధి పొందాలని ప్రయత్నిస్తున్నారని వ్యాఖ్యానించారు. ఫార్ములా-ఈ రేసింగ్ పోటీలను హైదరాబాద్‌కు తీసుకురావడం ద్వారా అంతర్జాతీయ స్థాయిలో నగరానికి గుర్తింపు లభించిందని కేటీఆర్ పేర్కొన్నారు. ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులు ప్రపంచస్థాయి కార్యక్రమాలను వినియోగించుకుని పెట్టుబడులను ఆకర్షిస్తుంటే, తెలంగాణలో మాత్రం ఆ అవకాశాలను వదులుకున్నారని విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలో ప్రారంభించిన ప్రతిష్టాత్మక కార్యక్రమాలను ప్రస్తుత ప్రభుత్వం కొనసాగించలేకపోయిందని అన్నారు. ఫార్ములా-ఈ రేసింగ్ ఈవెంట్‌ను రద్దు చేయడంతో రాష్ట్రానికి రావాల్సిన అవకాశాలు దూరమయ్యాయని కేటీఆర్ అభిప్రాయపడ్డారు. అభివృద్ధి ప్రాజెక్టులను నిలిపివేయడమే కాకుండా, వాటికి సంబంధించిన అంశాలపై తమపైనే కేసులు నమోదు చేయడం సరైన విధానం కాదని అన్నారు. ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు రాష్ట్ర ప్రయోజనాలకు అనుకూలంగా లేవని విమర్శించారు. తమపై వచ్చిన ఆరోపణలను చట్టపరంగా ఎదుర్కొంటామని కేటీఆర్ స్పష్టం చేశారు. న్యాయస్థానాల ముందు అన్ని విషయాలు వెల్లడిస్తామని, వాస్తవాలు బయటకు వస్తాయని పేర్కొన్నారు. కేసుల విషయంలో తమకు ఎలాంటి భయం లేదని, చట్టపరమైన పోరాటం కొనసాగిస్తామని చెప్పారు. దేశ న్యాయవ్యవస్థపై తమకు పూర్తి విశ్వాసం ఉందని కేటీఆర్ అన్నారు. రాజకీయ కుట్రలు, తప్పుడు ఆరోపణలను న్యాయస్థానంలోనే ఎదుర్కొంటామని తెలిపారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడుతూ చట్టబద్ధ మార్గంలోనే ముందుకు సాగుతామని, ప్రభుత్వ విధానాలపై తమ పోరాటం కొనసాగుతుందని వెల్లడించారు.

# ఏపీఆర్ఎస్‌లను ప్రతిభా కేంద్రాలుగా తీర్చిదిద్దాలి: లోకేష్

- అంతర్జాతీయ ప్రమాణాలతో విద్యా వ్యవస్థకు రూపకల్పన
- ఏఐ శిక్షణ, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లకు ఆమోదం
- 59వ గవర్నింగ్ బాడీ సమావేశంలో కీలక నిర్ణయాలు

**అమరావతి, సెప్టెంబర్ 18 (నవ జ్యోతి ప్రతినిధి)** రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఆంధ్రప్రదేశ్ రెసిడెన్షియల్ పాఠశాలలను ప్రతిభావంతులను తయారుచేసే అత్యుత్తమ విద్యా కేంద్రాలుగా అభివృద్ధి చేయాలని విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అధికారులను ఆదేశించారు. ఉండవల్లిలోని తన నివాసంలో నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్ సొసైటీ 59వ గవర్నింగ్ బాడీ సమావేశంలో ఆయన పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. మారుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా విద్యార్థులకు ప్రపంచ స్థాయి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో విద్యా వ్యవస్థలో సంస్కరణలు చేపట్టాలని సూచించారు. సమావేశంలో మంత్రి మాట్లాడుతూ రెసిడెన్షియల్ పాఠశాలలు కేవలం విద్యా బోధనకే పరిమితం కాకుండా భవిష్యత్ నాయకులు, శాస్త్రవేత్తలు, పరిపాలనా అధికారులు తయారయ్యే కేంద్రాలుగా మారాలని అన్నారు. ఇప్పటివరకు ఈ విద్యాసంస్థల్లో చదివిన అనేక మంది ఐఏఎస్, ఐపీఎస్, ఐఆర్ఎస్, ఐఎఫ్ఎస్ అధికారులుగా ఎదిగిన విషయాన్ని గుర్తు చేస్తూ మరింత మంది ప్రతిభావంతులను తయారుచేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రోత్సహించే చర్యలను కూడా కొనసాగించాలని సూచించారు. సాంకేతిక రంగంలో వేగంగా జరుగుతున్న మార్పులను దృష్టిలో ఉంచుకుని అన్ని రెసిడెన్షియల్ పాఠశాలల్లో కృత్రిమ మేధస్సు శిక్షణను తప్పనిసరి చేయాలని సమావేశం నిర్ణయించింది. విద్యార్థులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో ఉండేలా అత్యాధునిక కంప్యూటర్ ప్రయోగశాలలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అలాగే రాష్ట్రవ్యాప్తంగా పది రెసిడెన్షియల్ విద్యాసంస్థలను సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లుగా అభివృద్ధి చేసే ప్రతిపాదనకు



గవర్నింగ్ బాడీ ఆమోదం తెలిపింది. విద్యా నాణ్యతను పెంచేందుకు ప్రత్యేక ప్రణాళికలు అమలు చేయనున్నారు.

(మిగతా.. 2లో)

# పోక్సో కేసులో నిందితుడికి శిక్ష

- అక్షాన్ష్ యాదవ్ పర్యవేక్షణలో దర్యాప్తు
- తుర్కపల్లి కేసులో కోర్టు తీర్పు
- ధీరవత్ నవీన్‌కు 20 ఏళ్ల జైలు
- బాలల భద్రతపై అప్రమత్తంగా ఉండాలని సూచన

**భువనగిరి, సెప్టెంబర్ 18 (నవజ్యోతి ప్రతినిధి) :** మైనర్ బాలికపై లైంగిక దాడికి సంబంధించిన పోక్సో కేసులో నిందితుడికి భువనగిరి ప్రత్యేక ఫాస్ట్ ట్రాక్ పోక్సో కోర్టు కఠిన శిక్ష విధించింది. తుర్కపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో 2021లో నమోదైన కేసును విచారించిన న్యాయస్థానం నిందితుడిని దోషిగా నిర్ధారిస్తూ తీర్పు వెలువరించింది. బాలలపై లైంగిక నేరాల విషయంలో చట్టం ఎంత కఠినంగా వ్యవహరిస్తుందో ఈ తీర్పు మరోసారి స్పష్టం చేసింది. కోర్టు తీర్పు ప్రకారం ధీరవత్ నవీన్ (25)కు 20 సంవత్సరాల జైలు శిక్షతో పాటు రూ.10 వేల జరిమానా విధించారు. మైనర్ బాలికపై జరిగిన లైంగిక దాడికి సంబంధించిన ఆరోపణలు విచారణలో రుజువుకావడంతో న్యాయస్థానం ఈ శిక్ష ఖరారు చేసింది. కేసుకు సంబంధించిన అన్ని అంశాలను పరిశీలించిన అనంతరం తీర్పు వెలువడింది. ఫిర్యాదు అందిన వెంటనే తుర్కపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఘటనకు సంబంధించిన సాక్ష్యాధారాలను సేకరించి, బాధితురాలి వాంగ్మూలాలు నమోదు చేసి, అవసరమైన చట్టపరమైన ప్రక్రియలను పూర్తి చేశారు. అనంతరం పూర్తి వివరాలతో చార్జ్‌షీట్‌ను న్యాయస్థానంలో దాఖలు చేశారు. పోలీసుల దర్యాప్తు, సాక్ష్యాధారాల సమర్పణతో కేసు విచారణ వేగంగా సాగిందని అధికారులు తెలిపారు. బాలలపై లైంగిక నేరాలకు పాల్పడే వ్యక్తులపై కఠిన చర్యలు తప్పవని పేర్కొన్నారు. ఇటువంటి కేసుల్లో బాధితులకు న్యాయం అందించేందుకు పోలీసు శాఖ ప్రత్యేక దృష్టి సారిస్తోందని వెల్లడించారు. పోక్సో చట్టం బాలలపై జరిగే లైంగిక నేరాలను అరికట్టేందుకు ప్రత్యేక రక్షణ కల్పిస్తుందని అధికారులు గుర్తు చేశారు. 18 సంవత్సరాల లోపు



పిల్లలపై లైంగిక వేధింపులు, దాడులు లేదా ఇతర లైంగిక నేరాలకు పాల్పడటం తీవ్రమైన నేరమని స్పష్టం చేశారు.

(మిగతా.. 2లో)

# జగన్ వ్యాఖ్యలపై అచ్చెన్నాయుడు విమర్శలు

- ఎల్‌నినోపై ముందస్తు చర్యలు చేపట్టామని వెల్లడి
- రైతుల కోసం భారీ స్థాయిలో కార్యక్రమాల అమలు
- వైసీపీ పాలనలో వ్యవసాయానికి నష్టం జరిగిందని ఆరోపణ



**అమరావతి, సెప్టెంబర్ 18 (నవజ్యోతి ప్రతినిధి)** ఎల్‌నినో ప్రభావంపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్ చేసిన వ్యాఖ్యలను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తీవ్రంగా ఖండించారు. జగన్‌కు ఎల్‌నినోపై బాధ కాదని, అది 'అబద్ధాల నినో' డ్రామా మాత్రమేనని విమర్శించారు. రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశాన్ని ముందుగానే గుర్తించి ప్రభుత్వం క్షేత్రస్థాయిలో చర్యలు చేపట్టిందని తెలిపారు. ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు కూటమి ప్రభుత్వం సమగ్ర కార్యాచరణ రూపొందించిందని అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. నీటి సంరక్షణ, భూగర్భ జలాల పెంపు, ప్రత్యామ్నాయ సాగు విధానాల అమలుపై ప్రత్యేక దృష్టి పెట్టామని చెప్పారు. రైతులు ఇబ్బందులు పడకుండా ముందస్తు చర్యలతో వ్యవసాయ రంగాన్ని రక్షించేందుకు ప్రయత్నిస్తున్నామని వివరించారు. 'జలధార--జలహారతి' కార్యక్రమం కింద రాష్ట్రవ్యాప్తంగా 79,826 పనులు పూర్తి చేసినట్లు మంత్రి తెలిపారు. ఈ చర్యల ఫలితంగా భూగర్భ జలాల మట్టం సగటున 0.79 మీటర్లు పెరిగిందని పేర్కొన్నారు. నీటి నిల్వలు పెంచడం ద్వారా సాగు, తాగునీటి అవసరాలకు భరోసా కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ప్రకృతి ఆధారిత సాగు విధానాలు, నీటి పొదుపు పద్ధతుల వైపు రైతులను ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో 17 లక్షల మంది రైతులు స్వచ్ఛందంగా పంటల నిర్వహణ, నీటి వినియోగ సామర్థ్యాన్ని పెంచే పద్ధతులను అవలంబిస్తున్నారని చెప్పారు. రైతుల ఆదాయం పెరగడంతో పాటు వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనే

(మిగతా.. 2లో)



## ఏపీఆర్ఎస్‌లను ప్రతిభా కేంద్రాలుగా
# తీర్చిదిద్దాలి: లోకేష్



(మొదటి పేజీ తరువాయి..)

విద్యార్థులకు ఉన్నత స్థాయి పోటీ పరీక్షల శిక్షణ అందించేందుకు కృష్ణా జిల్లా నిమ్మకూరులోని ఏపీఆర్ జూనియర్ కళాశాలలో వచ్చే విద్యాసంవత్సరం నుంచి ఐఐటీ--జేఈఈ, నీట్ అకాడమీ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. మరో ఆరు రెసిడెన్షియల్ పాఠశాలలను జూనియర్ కళాశాలలుగా అభివృద్ధి చేసేందుకు కూడా సమావేశం ఆమోదం తెలిపింది. దీని ద్వారా గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు నాణ్యమైన ఉన్నత విద్య అందుబాటులోకి రానుంది. సిబ్బంది సంక్షేమం విషయంలో కూడా పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. రెసిడెన్షియల్ విద్యాసంస్థల సిబ్బంది పదవీ విరమణ వయసును 60 నుంచి 62 సంవత్సరాలకు పెంచే ప్రతిపాదనకు ఆమోదం లభించింది. గెస్ట్ ఫ్యాకల్టీల గౌరవ వేతనాలను పెంచడంతో పాటు శారీరక విద్య ఉపాధ్యాయులను ఉన్నత హోదాలకు అప్‌గ్రేడ్ చేయాలని నిర్ణయించారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది నియామకాల కోసం కొత్త సిబ్బంది నమూనాను కూడా ఆమోదించారు. మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తూ అన్ని రెసిడెన్షియల్ పాఠశాలలకు శాశ్వత భవనాలు, మెరుగైన సదుపాయాలు కల్పించాలని మంత్రి ఆదేశించారు. ఆటోమేటెడ్ స్మార్ట్ కిచెన్‌ల ఏర్పాటు, విద్యార్థుల వైద్య అత్యవసర అవసరాల కోసం ప్రత్యేక నిధుల వినియోగం, భూపతిపాలెం రెసిడెన్షియల్ పాఠశాలను ప్రపంచ స్థాయి క్రీడా కేంద్రంగా అభివృద్ధి చేసే అవకాశాలపై కూడా సమావేశంలో చర్చించారు. విద్యా రంగంలో నాణ్యత, సాంకేతికత, మౌలిక వసతుల సమన్వయంతో రాష్ట్రంలోని రెసిడెన్షియల్ విద్యాసంస్థలను దేశంలోనే ఆదర్శవంతమైన సంస్థలుగా తీర్చిదిద్దాలని మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు.

## జగన్ వ్యాఖ్యలపై..
# అచ్చెన్నాయుడు విమర్శలు

(మొదటి పేజీ తరువాయి..)

సామర్థ్యం కూడా పెరుగుతోందని వివరించారు. వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధరలు కల్పించేందుకు మార్కెట్ ఇంటర్వెన్షన్ కార్యక్రమాలపై కూటమి ప్రభుత్వం రూ.800 కోట్లకు పైగా ఖర్చు చేసినట్లు అచ్చెన్నాయుడు వెల్లడించారు. రైతుల ప్రయోజనాల కోసం అవసరమైన చోట ప్రభుత్వ జోక్యాన్ని పెంచామని చెప్పారు. పంటల ధరలు పడిపోకుండా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో రైతులకు చెప్పుకోదగ్గ మేలు జరగలేదని అచ్చెన్నాయుడు ఆరోపించారు. కాగితాలపై లెక్కలు చూపిస్తూ రైతులను మోసం చేశారని విమర్శించారు. ప్రస్తుతం రైతు సంక్షేమం, నీటి సంరక్షణ, వ్యవసాయ అభివృద్ధిని లక్ష్యంగా పెట్టుకుని ప్రభుత్వం పనిచేస్తోందని, వాస్తవాలను వక్రీకరించి రాజకీయ ఆరోపణలు చేయడం సరికాదని పేర్కొన్నారు.




# పోక్సో కేసులో నిందితుడికి శిక్ష

(మొదటి పేజీ తరువాయి..)

ఇలాంటి నేరాలపై సమాజం అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. బాలల భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని జిల్లా ఎస్పీ అక్షాన్ష్ యాదవ్ తెలిపారు. బాలలపై లైంగిక వేధింపులు లేదా అనుమానాస్పద ఘటనలు తెలిసిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా బాలల సహాయవాణి, అత్యవసర సేవలకు సమాచారం అందించాలని సూచించారు. పిల్లలను నమ్మడం, వారికి అండగా నిలవడం, నేరాలను దాచిపెట్టకుండా వెంటనే ఫిర్యాదు చేయడం ద్వారా బాలల రక్షణకు అందరూ సహకరించాలని పిలుపునిచ్చారు.

## గణేష్ మండపాలను సందర్శించి
# ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే మర్రి



అల్వాల్, సెప్టెంబర్ 18 (నవజ్యోతి ప్రతినిధి): మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అల్వాల్ సర్కిల్ పరిధిలోని మచ్చబొల్లారం, టెంపుల్ అల్వాల్, తుర్కపల్లి డివిజన్లలో ఏర్పాటు చేసిన పలు గణేష్ మండపాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవ నిర్వాహకులు - భక్తులతో మాట్లాడి ఏర్పాట్లను తెలుసుకున్నారు. అనంతరం పలు గణేష్ మండపాల నిర్వాహకులకు ఆర్థిక సహాయం అందజేశారు. గణేష్ నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో - శాంతియుత వాతావరణంలో నిర్వహించుకోవాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. వినాయకుడి ఆశీస్సులతో ప్రజలంతా సుఖసంతోషాలతో - ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకున్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు తోట నరేందర్‌రెడ్డి, డోలి రమేష్, డిల్లీ పరమేష్, భాస్కర్‌రెడ్డి, నార్ల సురేష్, పవన్, ప్రశాంత్‌రెడ్డి, సురేష్, శ్రీధర్‌గౌడ్, సాయి, గణేష్, అజయ్, జావీద్, రెహ్మత్‌ఖాన్, ఆరిఫ్, దేవేందర్, నాగరాజు, మహేష్, తిరుమల్, పెంటారెడ్డి, భాస్కర్‌గౌడ్, యాదగిరిగౌడ్, నర్సింగ్‌రావు, సాజిద్, సందీప్, రామకృష్ణ, మణికంత, అరుణ్, అభి, ప్రశాంత్, సాయిరాజ్, కాలనీ సంక్షేమ సంఘాల నాయకులు, మహిళలు, యువకులు, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు - భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకోవాలి
## నడిగూడెం కళాశాల ప్రిన్సిపల్ విజయ నాయక్



నడిగూడెం, సెప్టెంబర్ 18 (నవజ్యోతి ప్రతినిధి షేక్ నజురుద్దీన్): ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకోవాలని కేఎల్ఎన్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ డి. విజయ నాయక్ సూచించారు. శుక్రవారం కళాశాలలో ప్రథమ సంవత్సరం విద్యార్థులకు నిర్వహించిన ఫ్రెషర్స్ డే కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ విద్యార్థుల హాజరు శాతం పెరగాలని, క్రమం తప్పకుండా కళాశాలకు హాజరైనప్పుడే ఉత్తీర్ణత సాధించగలరని తెలిపారు. కార్యక్రమంలో నిర్వహించిన క్రీడల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. విద్యార్థుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు - అధ్యాపకేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కుల వివక్ష నిర్మూలనకు ఆలోచనా విధానం మారాలి

- 'పాలిటిక్స్ బియాండ్ క్యాస్ట్' సదస్సులో కల్వకుంట్ల కవిత
- బీసీ ఉపకులాలను కూడా జనగణనలో లెక్కించాలని డిమాండ్
- కులాల జనాభాను తక్కువ చేసి చూపే ప్రమాదం ఉందని ఆందోళన
- అన్ని వర్గాలకు రాజ్యాధికారంలో భాగస్వామ్యం అవసరం

**హైదరాబాద్, సెప్టెంబర్ 18 (నవజ్యోతి ప్రతినిధి)**

కుల వివక్ష నిర్మూలన కోసం సమాజంలో ఆలోచనా విధానం మారాల్సిన అవసరం ఉందని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత అన్నారు. ది యునైటెడ్ ఫోరం ఫర్ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్, సకల జన సేవా సంస్థాన్ ఆధ్వర్యంలో నిర్వహించిన "పాలిటిక్స్ బియాండ్ క్యాస్ట్" సదస్సులో పాల్గొన్న ఆమె కుల వివక్ష, సామాజిక సమానత్వం, కుల గణన వంటి అంశాలపై విస్తృతంగా మాట్లాడారు. దేశంలో ఎంతటి ఉన్నత పదవుల్లో ఉన్నవారైనా కుల వివక్షను ఎదుర్కొన్న సందర్భాలు ఉన్నాయని పేర్కొంటూ, కులం ఆధారంగా మనుషులను చూడడం ఇప్పటికీ కొనసాగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. సమాజంలో మార్పు రావాలంటే ముందుగా మనిషిని మనిషిగా చూసే దృక్పథం పెరగాలని అన్నారు. దేశవ్యాప్తంగా లక్షలాది మంది ప్రజలు ఇంకా కుల వివక్షను ఎదుర్కొంటున్నారని కవిత పేర్కొన్నారు. ఇటీవల కొన్ని ప్రాంతాల్లో కులం ఆధారంగా ఇళ్లు అద్దెకు ఇవ్వబోమని బోర్డులు పెట్టిన ఘటనలు వెలుగులోకి వచ్చాయని, ఇలాంటి సంఘటనలు సమాజానికి మంచివి కావని అన్నారు. ఒక వ్యక్తితో కలిసి కూర్చుంటే, తాకితే ఏదో జరుగుతుందనే భావనలు ఇప్పటికీ కొనసాగడం బాధాకరమని పేర్కొన్నారు. కుల వివక్ష అనే సామాజిక రోగాన్ని నిర్మూలించడానికి ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యత తీసుకోవాలని పిలుపునిచ్చారు. కుల గణన విషయంలో కేంద్ర ప్రభుత్వం మరింత స్పష్టతతో వ్యవహరించాలని కవిత కోరారు. కేవలం బీసీ అనే ఒకే విభాగాన్ని నమోదు చేయకుండా, బీసీల్లోని ఉపకులాలను కూడా ప్రత్యేకంగా లెక్కించాలని సూచించారు. దేశంలోని ఒకే కులానికి వేర్వేరు రాష్ట్రాల్లో వేర్వేరు పేర్లు, వర్గీకరణలు ఉండటం వల్ల ఉపకులాలను నమోదు చేయకపోతే అసలు జనాభా గణాంకాలు వక్రీకరించే ప్రమాదం ఉందని చెప్పారు. సరైన లెక్కలు లేకుంటే ప్రభుత్వ విధానాలు కూడా ప్రభావితమవుతాయని పేర్కొన్నారు. బీసీ ఉపకులాల వివరాలు నమోదు కాకపోతే వారి జనాభా వాస్తవానికి కంటే తక్కువగా కనిపించే అవకాశం ఉందని కవిత అన్నారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టనున్న జనగణనలో ఉపకులాలకు ప్రత్యేక స్థానం కల్పించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో బీసీల జనాభా గణనపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయని, సరైన సమాచారం లేకపోతే సామాజిక న్యాయానికి సంబంధించిన నిర్ణయాలు ప్రభావితం అవుతాయని పేర్కొన్నారు. కులాల వారీగా ఖచ్చితమైన గణాంకాలు అందుబాటులో ఉండటం అత్యంత అవసరమని అన్నారు. సమాజంలోని అన్ని వర్గాలకు రాజకీయ, ఆర్థిక, సామాజిక రంగాల్లో సమాన అవకాశాలు కల్పించినప్పుడే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుందని కవిత పేర్కొన్నారు. ప్రతి కులాన్ని సాధికారత దిశగా నడిపించాల్సిన అవసరం ఉందని చెప్పారు. రాజ్యాధికారంలో అన్ని వర్గాలకు తగిన ప్రాతినిధ్యం కల్పించడంతో పాటు వారి ఆర్థిక పరిస్థితులను మెరుగుపర్చే చర్యలు కూడా అవసరమని అభిప్రాయపడ్డారు. సరైన గణాంకాలు ఉంటేనే ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రభుత్వాలు నిర్ణయాలు తీసుకోగలవని అన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చిన విధంగానే కుల వివక్ష నిర్మూలన కోసం కూడా సమిష్టి ఉద్యమం




అవసరమని కవిత పేర్కొన్నారు. తెలంగాణ సాధన కోసం ప్రజలను ఏకం చేసినట్లే సామాజిక సమానత్వం కోసం కూడా అందరూ కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. కుల గణన ప్రక్రియలో ఉపకులాల నమోదుకు ఇంకా సమయం ఉందని, కేంద్ర ప్రభుత్వం దీనిపై సానుకూల నిర్ణయం తీసుకోవాలని కోరారు. కుల వివక్ష లేని సమాజ నిర్మాణమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆమె సూచించారు.

# సిద్దిపేట యాత్రపై హరీశ్‌రావు విమర్శలు

- ప్రజాధనం, ప్రభుత్వ సమయం వృథా చేశారని ఆరోపణ
- రాష్ట్ర హక్కుల కోసం పోరాడాలని సూచన
- రాజకీయ కక్షసాధింపులకు యాత్రలు వద్దన్న హరీశ్‌రావు



**సిద్దిపేట, సెప్టెంబర్ 18 (నవజ్యోతి ప్రతినిధి)**

సిద్దిపేట జిల్లాలో కాంగ్రెస్ ఎంపీలు, ఎమ్మెల్సీలు నిర్వహించిన పర్యటనపై మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు తీవ్ర విమర్శలు చేశారు. ఎంపీల యాత్రల పేరుతో ఏదో యుద్ధానికి వస్తున్నట్లుగా సిద్దిపేటకు వచ్చారని ఆయన వ్యాఖ్యానించారు. యాత్ర పేరుతో ప్రజాధనం, ప్రభుత్వ సమయం ఎంత మేర వృథా అయిందో ప్రజలే ఆలోచించాలని సూచించారు. ప్రభుత్వాలు వాస్తవాలను దాచిపెట్టిన సందర్భాల్లో ప్రతిపక్షాలు నిజనిర్ధారణ కోసం క్షేత్రస్థాయికి వెళ్లడం సహజమని హరీశ్‌రావు పేర్కొన్నారు. అయితే అధికారంలో ఉన్న ప్రభుత్వ ప్రతినిధులే యాత్రలు నిర్వహించడం విచారకరమని అభిప్రాయపడ్డారు. ప్రభుత్వ యంత్రాంగం చేతిలో ఉన్నప్పుడు ప్రత్యేక యాత్రల అవసరం ఏమిటని ప్రశ్నించారు. ప్రభుత్వానికి అన్ని శాఖలు, అధికారులు అందుబాటులో ఉన్న నేపథ్యంలో అవసరమైన నివేదికలను సులభంగా తెప్పించుకోవచ్చని ఆయన అన్నారు. అధికార పక్ష నాయకులు క్షేత్రస్థాయిలో పర్యటనలు చేసి ఆరోపణలు చేయడం కంటే అధికారిక సమాచారం ఆధారంగా వ్యవహరించాలని సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాల్సిన సమయంలో రాజకీయ కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇవ్వడం సరికాదన్నారు. రాష్ట్ర ప్రయోజనాలు, అభివృద్ధి అంశాలపై అన్ని రాజకీయ పార్టీలు కలిసికట్టుగా పనిచేయాల్సిన అవసరం ఉందని హరీశ్‌రావు తెలిపారు. ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్రానికి రావాల్సిన నిధులు, హక్కుల కోసం ఎంపీలు సమష్టిగా పోరాడాలని పిలుపునిచ్చారు. ప్రజల ఆశయాల సాధనలో ప్రజాప్రతినిధుల పాత్ర మరింత బాధ్యతాయుతంగా ఉండాలని పేర్కొన్నారు. రాజకీయ విభేదాలు ప్రజాస్వామ్యంలో సహజమే అయినప్పటికీ, వాటిని కక్షసాధింపు రాజకీయాల స్థాయికి తీసుకెళ్లకూడదని హరీశ్‌రావు అభిప్రాయపడ్డారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై చర్చించాల్సిన సమయంలో ఆరోపణలు, ప్రత్యారోపణలతో రాజకీయ వాతావరణాన్ని కలుషితం చేయడం మంచిది కాదన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వాల ప్రధాన లక్ష్యంగా ఉండాలని సూచించారు. సిద్దిపేట పర్యటన సందర్భంగా వెలువడిన పరిణామాలపై స్పందిస్తూ హరీశ్‌రావు ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తూ రాష్ట్ర అభివృద్ధి కోసం అన్ని వర్గాలు కలిసి ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు. రాజకీయ ప్రయోజనాల కంటే ప్రజా ప్రయోజనాలకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

# 22-ఏ సమస్యల పరిష్కారానికి కమిటీ

(మొదటి పేజీ తరువాయి..)

ఉన్నతాధికారులు సభ్యులుగా ఉండి 22-ఏ సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టనున్నారు. పెండింగ్‌లో ఉన్న వివిధ అంశాలను పరిశీలించి త్వరితగతిన నిర్ణయాలు తీసుకోవడం కమిటీ బాధ్యతగా ఉంటుంది. ఎల్‌బీ నగర్ నియోజకవర్గ పరిధిలో 118 జీవో ప్రకారం 9,700 ప్లాట్ల రెగ్యులరైజేషన్‌కు సంబంధించిన మెమోను ప్రభుత్వం జారీ చేసినట్లు మంత్రి తెలిపారు. గతంలో ఇచ్చిన హామీల అమలులో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. దశాబ్దాలుగా ఇళ్ల నిర్మాణం చేసుకుని నివసిస్తున్న కుటుంబాలకు ఇది ఊరటనిచ్చే చర్యగా భావిస్తున్నారు. 118 జీవో ప్రకారం రెగ్యులరైజేషన్ ప్రక్రియను ప్రారంభిస్తున్నట్లు మంత్రి వెల్లడించారు. అర్హులైన ప్లాటు యజమానులు స్థానిక అధికారులను సంప్రదించి నిబంధనల ప్రకారం తమ ఆస్తులను రెగ్యులరైజ్ చేసుకోవాలని సూచించారు. సమస్య పూర్తిగా పరిష్కారమయ్యే వరకు ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని స్పష్టం చేశారు. సింగరేణి ప్రాంతాల్లో ఇండ్ల స్థలాల రెగ్యులరైజేషన్ అంశాన్ని కూడా ప్రభుత్వం ప్రాధాన్యంగా తీసుకుంటోందని మంత్రి తెలిపారు. దీనిపై ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహించి తదుపరి కార్యాచరణను ప్రారంభించనున్నట్లు చెప్పారు. గతంలో జారీ చేసిన సంబంధిత జీవోలను అనుసరించి చర్యలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. అలాగే 22-ఏ జాబితాలో ఉన్నప్పటికీ హెచ్‌ఎండీఏ, డీటీసీపీ, జీహెచ్‌ఎంసీ అనుమతులతో అభివృద్ధి చెందిన లేఅవుట్లను 22-ఏ నుంచి తొలగించే అంశంపై కూడా త్వరలో నిర్ణయం తీసుకుంటామని మంత్రి ప్రకటించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శాసనసభలో ప్రకటించిన అంశాలపై నెలరోజుల వ్యవధిలో నిర్ణయాలు తీసుకుని దరఖాస్తుదారులకు ఉపశమనం కల్పించే దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని తెలిపారు.



# తీర భద్రతకు సాంకేతిక బలోపేతం

(మొదటి పేజీ తరువాయి..)

దిగుమతులపై ఆధారపడకుండా స్వదేశీ సామర్థ్యాలను పెంపొందించడం ద్వారా రక్షణ రంగం మరింత బలపడుతుందని తెలిపారు. తీర రక్షక దళ అవసరాలకు అనుగుణంగా దేశీయ పరిశ్రమలు, పరిశోధనా సంస్థలతో భాగస్వామ్యాన్ని పెంచాలని సూచించారు. సముద్ర భద్రతా కార్యకలాపాల్లో అంతరాయం కలగకుండా బలమైన సరఫరా వ్యవస్థలను ఏర్పాటు చేయాల్సిన అవసరాన్ని సీడీఎస్ ప్రస్తావించారు. నౌకలు, విమానాలు, సాంకేతిక పరికరాలకు అవసరమైన విడిభాగాలు, వనరులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. దీని ద్వారా తీర రక్షక దళం కార్యాచరణ సామర్థ్యం మరింత పెరుగుతుందని పేర్కొన్నారు. సాంకేతికత ఆధారిత అభివృద్ధి, స్వావలంబన, సంయుక్త కార్యాచరణల ద్వారా భారత తీర రక్షక దళం దేశ సముద్ర ప్రయోజనాల పరిరక్షణలో మరింత కీలక పాత్ర పోషిస్తుందని సదస్సులో అభిప్రాయపడారు. వికసిత భారత్--2047 లక్ష్య సాధనలో భాగంగా సముద్ర భద్రతను మరింత బలోపేతం చేయడానికి తీర రక్షక దళం కట్టుబడి ఉందని అధికారులు తెలిపారు.

# జిన్నారం మున్సిపల్ సిబ్బంది వేతనాలు సకాలంలో చెల్లించాలి



## రాష్ట్ర మున్సిపల్ శాఖ కార్యదర్శికి మెమోరాండం అందజేసిన చైర్మన్

పటాన్‌చెరు (జిన్నారం), సెప్టెంబర్ 18 (నవజ్యోతి ప్రతినిధి): జిన్నారం మున్సిపాలిటీలోని వివిధ విభాగాల సిబ్బందికి పెండింగ్‌లో ఉన్న వేతన బకాయిలను వెంటనే చెల్లించి, ప్రతి నెలా జీతాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ మున్సిపల్ పాలకవర్గం రాష్ట్ర మున్సిపల్ శాఖ కార్యదర్శి శ్రీదేవికి మెమోరాండం అందజేసింది. వేతనాలు సకాలంలో అందక సిబ్బంది ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, పెండింగ్ బకాయిలను తక్షణమే చెల్లించడంతో పాటు భవిష్యత్‌లో జీతాలు ఆలస్యం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. మున్సిపల్ చైర్మన్ నకిర్తి జనార్దన్ మాట్లాడుతూ సిబ్బంది సమస్యల పరిష్కారానికి పాలకవర్గం కృషి చేస్తోందని తెలిపారు. మెమోరాండంపై స్పందించిన కార్యదర్శి శ్రీదేవి వేతనాల సమస్య పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు చైర్మన్ తెలిపారు. కార్యక్రమంలో 17వ వార్డు కౌన్సిలర్ భక్తుల మహేష్, జిన్నారం మాజీ ఉపసర్పంచ్ శంకరప్ప, బీఆర్ఎస్ నాయకుడు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# నిమజ్జన ఏర్పాట్లు పరిశీలించిన ఆర్డీఓ రమణారెడ్డి

వేములపల్లి, సెప్టెంబర్ 18 (నవజ్యోతి ప్రతినిధి): గణేష్ నిమజ్జనాన్ని పురస్కరించుకుని వేములపల్లి మండలంలోని నిమజ్జన ప్రాంతాల్లో అధికారులు చేపట్టిన ఏర్పాట్లను మిర్యాలగూడ ఆర్డీఓ రమణారెడ్డి శుక్రవారం పరిశీలించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. భద్రత, బారికేడ్లు, విద్యుత్, లైటింగ్, తాగునీటి వసతి తదితర ఏర్పాట్లను పరిశీలించి, ప్రజల రద్దీకి అనుగుణంగా భద్రతా చర్యలు పటిష్టం చేయాలని సూచించారు. పోలీస్, రెవెన్యూ, మున్సిపల్ - పంచాయతీ శాఖలు సమన్వయంతో పనిచేసి నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంతంగా నిర్వహించాలని ఆదేశించారు. పరిశీలనలో మిర్యాలగూడ మున్సిపల్ కమిషనర్ శ్రీజారెడ్డి, వేములపల్లి ఎంపీడీవో, డిప్యూటీ తహసీల్దార్ కోటేశ్వరి, ఎస్సై డి. వెంకటేశ్వర్లు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.





# రైతులకు కరెంట్ కష్టాలు

• సబ్‌స్టేషన్ ఎదుట ధర్నా • సాగుకు 16 గంటల విద్యుత్ అందించాలి • విద్యుత్ కోతలపై రైతుల నిరసన




మాడుగులపల్లి, సెప్టెంబర్ 18 (నవజ్యోతి ప్రతినిధి): రైతులకు కనీసం 16 గంటల పాటు నిరంతర నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని రైతు సంఘం రాష్ట్ర నాయకుడు దేవిరెడ్డి అశోక్‌రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం మాడుగులపల్లి మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట రైతులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అశోక్‌రెడ్డి మాట్లాడుతూ 24 గంటల విద్యుత్ ఇస్తామని చెప్పినా ప్రస్తుతం 7-8 గంటలు మాత్రమే సరఫరా అవుతుండటంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. సకాలంలో వర్షాలు కురవక ఇప్పటికే ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులకు విద్యుత్ కోతలు మరింత సమస్యగా మారాయని, పంటలకు అవసరమైన సమయంలో విద్యుత్ అందక సాగునీరు పెట్టలేక నష్టపోతున్నారని తెలిపారు. ప్రభుత్వం - విద్యుత్ శాఖ అధికారులు స్పందించి కనీసం 16 గంటల విద్యుత్ సరఫరా చేయాలని, సమస్య పరిష్కారం కాకపోతే విద్యుత్ కార్యాలయాల ఎదుట ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో రైతు సంఘం మండల నాయకులు పుల్లెంల శ్రీకర్, దేవిరెడ్డి మల్లారెడ్డి, ఎలిజాల రమేష్, నారాయణరెడ్డి, పండుగ నాగయ్య, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గణనాథుడికి ప్రత్యేక పూజలు చేసిన అల్వాల్ సీఐ ప్రశాంత్

అల్వాల్, సెప్టెంబర్ 18 (నవజ్యోతి ప్రతినిధి): అల్వాల్ సర్కిల్ మచ్చబొల్లారం పరిధిలోని లక్ష్మీ ఎంక్లేవ్ కాలనీ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుడికి అల్వాల్ సీఐ ప్రశాంత్, ఎస్సైలు రాఘవేందర్‌రెడ్డి - రామకృష్ణ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ ప్రశాంత్ మాట్లాడుతూ కాలనీవాసులు ప్రశాంత వాతావరణంలో గణపతిని ప్రతిష్ఠించి నిత్య పూజలు నిర్వహించడం ఆనందదాయకమన్నారు. గణనాథుడి ఆశీస్సులతో కాలనీవాసులంతా సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం కాలనీ సెక్రటరీ శ్రీనివాస్‌రెడ్డి, కోటేశ్వరరావు, భక్తవత్సలరెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి పోలీసు అధికారులను శాలువాలతో సన్మానించారు.



## నిరుద్యోగ యువతకు అద్భుత అవకాశం



### నేడే కోదాడలో మెగా జాబ్ మేళా - యువత సద్వినియోగం చేసుకోవాలి

నడిగూడెం, సెప్టెంబర్ 18 (నవజ్యోతి ప్రతినిధి షేక్ నజురుద్దీన్): కోదాడలో సెప్టెంబర్ 19న నిర్వహించనున్న మెగా జాబ్ మేళాను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని మాజీ ఎంపీపీ యాతాకుల జ్యోతి మధుబాబు కోరారు. కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి అధ్యక్షతన - మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి సారథ్యంలో సీసీరెడ్డి కాన్వెంట్‌లో నిర్వహించే జాబ్ మేళాలో సుమారు 300 కంపెనీలు అభ్యర్థులను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఆన్‌లైన్‌లో రిజిస్టర్ చేసుకున్న అభ్యర్థులు శనివారం ఇంటర్వ్యూలకు హాజరు కావాలని సూచించారు. ఉద్యోగాల కోసం కంపెనీల చుట్టూ తిరిగే పరిస్థితిని మార్చి కంపెనీలనే యువత వద్దకు తీసుకురావడం అభినందనీయమన్నారు. గతంలో హుజూర్‌నగర్‌లో నిర్వహించిన మెగా జాబ్ మేళాతో వేలాది మందికి ఉద్యోగ అవకాశాలు లభించాయని, కోదాడలోనూ పెద్ద సంఖ్యలో యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

### బాధితురాలికి లక్ష రూపాయల

## సీఎంఆర్ఎఫ్ సాయం

కూకట్‌పల్లి, సెప్టెంబర్ 18 (నవజ్యోతి ప్రతినిధి): తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఫతేనగర్ డివిజన్‌కు చెందిన గీతాదేవికి సీఎంఆర్ఎఫ్ ద్వారా మంజూరైన రూ.లక్ష ఎల్‌వోసీ చెక్కును అందజేశారు. మెరుగైన వైద్యం పొంది త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ప్రజా సమస్యల పరిష్కారంతో పాటు పేదల ఆరోగ్య భద్రతకు నియోజకవర్గంలో ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక డివిజన్ ప్రతినిధులు - బాధితురాలి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



## బొమ్మారెడ్డిగూడెం కెనాల్‌ను పరిశీలించిన ఇరిగేషన్ అధికారులు

### సింగూర్ కెనాల్ ద్వారా ఐదు చెరువులకు సాగునీరు అందించే అవకాశాలపై క్షేత్రస్థాయి పరిశీలన



**చౌటకూర్, సెప్టెంబర్ 18 (నవజ్యోతి ప్రతినిధి):**
చౌటకూర్ మండలం బొమ్మారెడ్డిగూడెం గ్రామ శివారులోని చెరువులకు సింగూర్ కెనాల్ ద్వారా సాగునీరు అందించే అవకాశాలను ఇరిగేషన్ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశాల మేరకు ఇరిగేషన్ డీఈ మధుసూదన్, ఏడబ్ల్యుయూ మధుసూదన్ తదితరులు కాంగ్రెస్ సీనియర్ నాయకులు కుమ్మరి సాయిలు, మహేష్ రాథోడ్‌తో కలిసి కెనాల్‌ను పరిశీలించారు. బొమ్మారెడ్డిగూడెం పరిధిలోని పోష్‌కుంట, ఏశ్వమ్ చెరువు, గొల్లకుంట, నాన్ చెరువు, కోమటి చెరువులకు కెనాల్ నుంచి నీటిని మళ్లించే అవకాశాలపై వివరాలు సేకరించారు. ఇందుకు అవసరమైన పనులు, కెనాల్ మార్గం, నీటి ప్రవాహానికి సంబంధించిన అంశాలను పరిశీలించారు. త్వరలో పూర్తిస్థాయి సర్వే నిర్వహించి ప్రణాళిక రూపొందించి తదుపరి చర్యలు చేపడతామని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో కుమ్మరి సాయిలు, మహేష్ రాథోడ్, హరి నాయక్, డీలర్ కిషన్, జాదవత్ చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

## రాపాక విజయరాజు తల్లిని పరామర్శించిన ఎంపీ రఘునందన్‌రావు

### గుండె శస్త్రచికిత్స అనంతరం త్వరగా కోలుకోవాలని ఆకాంక్ష



**సంగారెడ్డి, సెప్టెంబర్ 18 (నవజ్యోతి ప్రతినిధి):**
ఇటీవల గుండె శస్త్రచికిత్స చేయించుకుని కోలుకుంటున్న డీజేఎఫ్ ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షుడు, జర్నలిస్ట్ రాపాక విజయరాజు తల్లిని మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్‌రావు శుక్రవారం పరామర్శించారు. ఆమె నివాసానికి వెళ్లిన ఎంపీ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని ఆకాంక్షించారు. వైద్యుల సూచనలు పాటిస్తూ మందులను క్రమం తప్పకుండా వాడాలని, తగిన విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. శస్త్రచికిత్స అనంతరం కొనసాగుతున్న చికిత్స, ప్రస్తుతం ఆరోగ్య పరిస్థితి గురించి కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. రాపాక విజయరాజు, ఆయన సతీమణి విజయలక్ష్మి, ఇతర కుటుంబ సభ్యులతో ఆత్మీయంగా మాట్లాడి ధైర్యం చెప్పారు. అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని భరోసా ఇచ్చారు. ఎంపీ రఘునందన్‌రావుతో పాటు తెలంగాణ అంబేద్కర్ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు కొండాపురం జగన్, డీజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు తలారి యాదగిరి తదితరులు ఆమెను పరామర్శించి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా రాపాక విజయరాజు మాట్లాడుతూ తన తల్లి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పిన ఎంపీ రఘునందన్‌రావు, కొండాపురం జగన్, తలారి యాదగిరి తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు. క్లిష్ట సమయంలో తమ కుటుంబాన్ని పరామర్శించడం ఎంతో ఆత్మీయతను కలిగించిందని పేర్కొన్నారు.

## పుట్నాల విశ్వేశ్ ఆధ్వర్యంలో కుకునూరులో అన్నదానం

### బీజేపీ జిల్లా అధ్యక్షుడు వల్దాస్ మల్లేష్‌గౌడ్ హాజరు

వెల్దుర్తి, సెప్టెంబర్ 18 (నవజ్యోతి ప్రతినిధి ముకుంద్): వెల్దుర్తి మండలం కుకునూరు గ్రామంలో జై భీమ్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పుట్నాల విశ్వేశ్ నిర్వహణలో అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు వల్దాస్ మల్లేష్‌గౌడ్ హాజరై పేదలు - భక్తులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జై భీమ్ యూత్ అసోసియేషన్ సేవా కార్యక్రమాలు అభినందనీయమని, యువత సమాజ సేవలో ముందుండాలని అన్నారు. పుట్నాల విశ్వేశ్‌ను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో కుకునూరు సర్పంచ్ సాయిలు, ఉప సర్పంచ్ నవీన్, వెల్దుర్తి సర్పంచ్ దండెం ఆదర్శ్, యశ్వంత్‌రావుపేట్ సర్పంచ్ మల్లేష్, జిల్లా సీనియర్ నాయకుడు అంగడిపేట శ్రీనివాస్‌గౌడ్, అల్లిపూర్ సర్పంచ్ కుమార్, జై భీమ్ యూత్ అసోసియేషన్ సభ్యులు, గ్రామ పెద్దలు, యువకులు - గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





### కిష్టాపూర్ ఇంద్రనగర్ కాలనీలో

## ఘనంగా మహా గణపతి అన్నదానం

మేడ్చల్, సెప్టెంబర్ 18 (నవజ్యోతి ప్రతినిధి): కిష్టాపూర్ ఇంద్రనగర్ కాలనీలో ఇంద్రనగర్ లైన్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహాగణపతి ఉత్సవాలు - మహా అన్నదాన కార్యక్రమం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కాలనీవాసులు - భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని గణనాథుడిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం నిర్వహించిన మహా అన్నదానంలో భక్తులకు అన్నప్రసాదం అందించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు తొంట నరేందర్, డబిల్‌పురం చిన్నకృష్ణ, తొంట బాలయ్య, డబిల్‌పురం నవీన్, డబిల్‌పురం నరసింహ, డబిల్‌పురం రాములు, తొంట యాదయ్య, తుడుం రమేష్‌బాబు, తుడుం నాగరాజు, చారుమల్ల మహేష్, చారుమల్ల శ్రీనివాస్, తొంట ప్రభాకర్, డబిల్‌పురం నరేష్, డబల్‌పురం మహేష్, తొంట సురేష్, తొంట మహేష్, తొంట నరేందర్, డబిల్‌పురం పెద్ద కృష్ణ, డబిల్‌పురం పరశురాం, మాజీ కౌన్సిలర్ తుడుం గణేష్ తదితరులు పాల్గొన్నారు.

### అక్టోబర్ 1, 2 తేదీల్లో

## ఇర్ఫాని దర్గా ఉర్సు ఉత్సవాలు

**24వ ఉర్సుకు విస్తృత ఏర్పాట్లు..**

**పోస్టర్ ఆవిష్కరించిన దర్గా పీఠాధిపతి ఉమర్ బీన్ అహ్మద్**




**సంగారెడ్డి, సెప్టెంబర్ 18 (నవజ్యోతి ప్రతినిధి):**
సంగారెడ్డి శివారులోని ఇర్ఫాని దర్గా 24వ ఉర్సు ఉత్సవాలను అక్టోబర్ 1, 2 తేదీల్లో ఘనంగా నిర్వహించనున్నట్లు దర్గా పీఠాధిపతి ఉమర్ బీన్ అహ్మద్ తెలిపారు. ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్లను శుక్రవారం ఆయన ఇతర నిర్వాహకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉమర్ బీన్ అహ్మద్ మాట్లాడుతూ అక్టోబర్ 1న సంప్రదాయబద్ధంగా గంధం ఊరేగింపు నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం అఖిల భారత కవి సమ్మేళనం జరుగుతుందని, వివిధ ప్రాంతాలకు చెందిన ప్రముఖ కవులు పాల్గొంటారని పేర్కొన్నారు. అక్టోబర్ 2న దీపారాధనతో పాటు ఖవ్వాలి, అన్నదాన కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఉర్సు ఉత్సవాలకు సంగారెడ్డి జిల్లాతో పాటు ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉందని, అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. భక్తులు ఉత్సవాల్లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో అన్వర్, అహ్మద్ ఇర్ఫాని, మహమ్మద్, నూమాన్ తదితరులు పాల్గొన్నారు.

### తారా కళాశాలలో

## అతిథి అధ్యాపక పోస్టుల భర్తీ

**19న డెమో, ఇంటర్వ్యూ..**

**అర్హులైన అభ్యర్థులు హాజరుకావాలని ప్రిన్సిపల్ ప్రవీణ సూచన**

**సంగారెడ్డి, సెప్టెంబర్ 18 (నవజ్యోతి ప్రతినిధి):**
సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ కళాశాలలో డిగ్రీ విద్యార్థులకు బోధించేందుకు ఖాళీగా ఉన్న అతిథి అధ్యాపక పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎం. ప్రవీణ తెలిపారు. కళాశాలలో బీబీఏ రిటైల్ ఆపరేషన్స్ విభాగంలో ఒకటి, బీసీఏ కంప్యూటర్ అప్లికేషన్స్ విభాగంలో ఒకటి చొప్పున అతిథి అధ్యాపక పోస్టులు ఖాళీగా ఉన్నట్లు పేర్కొన్నారు. సంబంధిత సబ్జెక్టులో పోస్ట్ గ్రాడ్యుయేషన్‌లో కనీసం 55 శాతం మార్కులతో ఉత్తీర్ణులైన వారు అర్హులని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు కనీసం 50 శాతం మార్కులు ఉండాలని పేర్కొన్నారు. బోధనా అనుభవంతో పాటు నెట్, స్లెట్, పీహెచ్‌డీ అర్హతలు కలిగిన అభ్యర్థులకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు వెల్లడించారు. అర్హత కలిగిన అభ్యర్థులు ఈ నెల 19న తారా ప్రభుత్వ కళాశాలలో నిర్వహించే డెమో, ఇంటర్వ్యూకు ఒరిజినల్ సర్టిఫికెట్లు, ఒక సెట్ జిరాక్స్ కాపీలతో హాజరుకావాలని ప్రిన్సిపల్ ప్రవీణ సూచించారు.

### 22(ఏ) భూములపై ప్రజలను

## తప్పుదోవ పట్టిస్తున్నారు

**వివాదాస్పద ప్రైవేటు భూముల సమస్య పరిష్కారానికి**

**ప్రభుత్వం చర్యలు: సత్యం శ్రీరంగం**



**సంగారెడ్డి, సెప్టెంబర్ 18 (నవజ్యోతి ప్రతినిధి):**
22(ఏ) నిషేధిత భూముల అంశంపై బీఆర్ఎస్ నేతలు కేటీఆర్, హరీష్‌రావు ప్రజలను తప్పుదోవ పట్టించేలా ప్రచారం చేస్తున్నారని టీపీసీసీ సీనియర్ అధికార ప్రతినిధి సత్యం శ్రీరంగం ఆరోపించారు. డీసీసీ అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డితో కలిసి సంగారెడ్డిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 22(ఏ) జాబితాలో ఉన్న మొత్తం భూములను, వివాదంలో ఉన్న ప్రైవేటు భూములను ఒకే విధంగా చూపుతూ బీఆర్ఎస్ నేతలు ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. ప్రస్తుతం ప్రభుత్వంతో వివాదంలో ఉన్న ప్రైవేటు భూముల విస్తీర్ణం సుమారు 3.74 లక్షల ఎకరాలుగా ఉందని పేర్కొన్నారు. ఈ సమస్యలను పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. గత బీఆర్ఎస్ పాలనలో ధరణి వ్యవస్థ కారణంగా భూ సమస్యలు మరింత సంక్లిష్టమయ్యాయని శ్రీరంగం ఆరోపించారు. అసైన్డ్ భూములకు సంబంధించి జరిగిన అక్రమాల వివరాలను బయటపెడతామని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు భూ భారతి ద్వారా చర్యలు చేపడుతోందన్నారు. రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రభుత్వం కొనసాగిస్తోందని తెలిపారు. దళితుల విషయంలో బీఆర్ఎస్ నాయకుల వైఖరిని కూడా ఆయన విమర్శించారు. సమావేశంలో టీపీసీసీ అధికార ప్రతినిధి తోపాజి అనంత కిషన్, నియోజకవర్గ ఇన్‌చార్జి చేర్యాల ఆంజనేయులు, సీడీసీ చైర్మన్ గడీల రామ్‌రెడ్డి, రఘుగౌడ్, మునిపల్లి సత్యనారాయణ, కూన సంతోష్, కిరణ్‌గౌడ్, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ బృంద పోటీలను ప్రారంభించిన ఎంపీ రఘునందన్‌రావు



రామచంద్రాపురం, సెప్టెంబర్ 18 (నవజ్యోతి ప్రతినిధి): పటాన్‌చెరు నియోజకవర్గం బీహెచ్‌ఈఎల్ టౌన్‌షిప్‌లోని జ్యోతి విద్యాలయ పాఠశాలలో భారత్ వికాస్ పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయ బృంద పోటీలను మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్‌రావు ప్రారంభించారు. విద్యార్థులు–నిర్వాహకులు–భారత్ వికాస్ పరిషత్ ప్రతినిధులతో కలిసి పోటీలను ప్రారంభించారు. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రతిభ కనబరుస్తున్న విద్యార్థులు పాల్గొనడంతో కార్యక్రమం ఉత్సాహభరితంగా సాగింది. కార్యక్రమంలో భారత్ వికాస్ పరిషత్ ప్రతినిధులు, పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు–నిర్వాహకులు పాల్గొన్నారు.

## మానవతా దృక్పథంతో ఆర్థిక సాయం చేసిన దయాకర్‌రెడ్డి

### నిరుపేద కుటుంబానికి రూ.10 వేల ఆర్థిక సాయం



రామచంద్రాపురం, సెప్టెంబర్ 18 (నవజ్యోతి ప్రతినిధి): తెల్లాపూర్ డివిజన్ కేసీఆర్ నగర్ ఫేజ్–2లోని 54వ బ్లాక్‌కు చెందిన కొత్తకొండ విజయలక్ష్మి అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ టెలికామ్ బోర్డు సభ్యుడు డాక్టర్ దయాకర్‌రెడ్డి ఆమె కుటుంబాన్ని పరామర్శించి రూ.10 వేల ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో కేసీఆర్ నగర్ ఫేజ్–2 బీఆర్ఎస్ నాయకులు మల్లేష్ యాదవ్, కోటేష్ నాయక్, అజయ్, శంకర్, తిరంగా యూత్ సభ్యులు సాయి, మనోజ్, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

## భగవన్నామ స్మరణతోనే ప్రశాంతత



గజ్వేల్, సెప్టెంబర్ 18 (నవజ్యోతి ప్రతినిధి): భగవన్నామ స్మరణతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని శ్రీశ్రీశ్రీ త్రిదండి రామానుజ అహోబిలం జీయర్ స్వామి అన్నారు. గజ్వేల్ పట్టణంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయాన్ని సందర్శించిన ఆయన భక్తులు–శాశ్వత సభ్యులను ఉద్దేశించి ప్రసంగించారు. నిత్య జీవితంలో నిరంతరం భగవంతుని నామస్మరణ చేయడం ద్వారా పరిపూర్ణ మానసిక ప్రశాంతత లభిస్తుందని తెలిపారు. కార్యక్రమానికి గజ్వేల్ పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారి ఆశీస్సులు పొందారు.

## గజ్వేల్–చేగుంట మార్గంలో ప్రమాదకరంగా రోడ్డు

### రైల్వే బ్రిడ్జి కింద మరమ్మతులు త్వరగా పూర్తి చేయాలి: బీజేపీ



గజ్వేల్, సెప్టెంబర్ 18 (నవజ్యోతి ప్రతినిధి): గజ్వేల్–చేగుంట ప్రధాన రహదారిలో ధర్మారెడ్డిపల్లి వద్ద రైల్వే బ్రిడ్జి కింద రోడ్డు పూర్తిగా ధ్వంసమై ప్రమాదకరంగా మారిందని బీజేపీ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. బీజేపీ జిల్లా కార్యదర్శి ఎలికంటి సురేష్, మండల అధ్యక్షుడు పంజాల అశోక్ గౌడ్ మాట్లాడుతూ సిమెంట్ దెబ్బతిని ఇనుప రాడ్లు బయటకు రావడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. భారీ వాహనాల రాకపోకలతో గుంతలు మరింత పెద్దవవుతున్నాయని పేర్కొన్నారు. మరమ్మతులు పూర్తయ్యే వరకు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని, రాజకీయాలకు అతీతంగా ప్రజా సమస్య పరిష్కారంపై దృష్టి పెట్టాలని కోరారు. పనులు త్వరగా పూర్తి చేయకపోతే బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యుడు వంజరి రాజు, ప్రధాన కార్యదర్శులు ఇప్ప స్వామి, బారు అరవింద్, ఉపాధ్యక్షులు శివమల్లు, శ్రీకాంత్ గౌడ్, బీజేవైఎం నాయకుడు మహేష్ చారి, రామస్వామి, మురారి లక్ష్మణ్, శ్రీరామ్, నగేష్, శ్రీరామ రాజు, మణికంఠ ముదిరాజ్, మల్లేశం, వెంకటేష్ రాజు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# భిక్కనూర్‌కు మంజూరైన ఇంటిగ్రేటెడ్ స్కూల్ తరలింపుపై ఆగ్రహం





### భిక్కనూర్‌లోనే నిర్మించాలని బీఆర్ఎస్, తెలంగాణ విద్యార్థి పరిషత్ డిమాండ్

### కాసంపల్లికి తరలిస్తే ఉద్యమం తప్పదని హెచ్చరిక

### మంజూరైనప్పుడు పాలాభిషేకం చేసిన వారే స్పందించాలంటున్న గ్రామస్తులు

భిక్కనూర్, సెప్టెంబర్ 18 (నవజ్యోతి ప్రతినిధి): భిక్కనూర్ మండలానికి మంజూరైన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌ను కామారెడ్డి మండలం కాసంపల్లి సమీపానికి తరలించే ప్రయత్నాలను నిలిపివేసి, భిక్కనూర్ మండలంలోనే అనువైన స్థలంలో నిర్మించాలని బీఆర్ఎస్ మండల శాఖ నాయకులు డిమాండ్ చేశారు. స్కూల్ మంజూరైన అనంతరం భిక్కనూర్ పరిధిలో ఇప్పటికే రెండు స్థలాలను పరిశీలించారు. అయితే అవి ప్రధాన రహదారికి దూరంగా ఉండటం, అవసరమైన మౌలిక వసతులు లేకపోవడంతో వాటిని ఎంపిక నుంచి తొలగించారు. ప్రస్తుతం కాసంపల్లి వైపు స్కూల్‌ను తరలించే అంశం తెరపైకి రావడంతో భిక్కనూర్‌లో చర్చనీయాంశంగా మారింది.భిక్కనూర్‌లోనే మరో అనువైన స్థలాన్ని గుర్తించి స్కూల్ నిర్మాణం చేపట్టాలని బీఆర్ఎస్ నాయకులు కోరారు. స్కూల్‌ను తరలిస్తే విద్యార్థులకు ఇబ్బందులు ఎదురవుతాయని, నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకపోతే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో శ్రీనివాస్ అత్తెల్లి, అందె మహేందర్, తునికి వేణు, రాంచంద్రం వెంకటరెడ్డి, మధుసూదన్, స్వామి పాల్గొన్నారు.ఇదే అంశంపై తెలంగాణ విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో కామారెడ్డి నియోజకవర్గ ఇన్‌చార్జి ఎండి సమీర్ ఖాన్ మాట్లాడుతూ.. భిక్కనూర్‌కు మంజూరైన ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌ను కాసంపల్లి జాతీయ రహదారి సమీపానికి తరలించడం సరికాదన్నారు. భిక్కనూర్‌తో పాటు చుట్టుపక్కల ప్రాంతాల విద్యార్థులకు అందుబాటులో ఉండేలా స్కూల్‌ను భిక్కనూర్‌లోనే ఏర్పాటు చేయాలని కోరారు. లేకపోతే విద్యార్థులతో కలిసి రాస్తారోకోలు, ధర్నాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో యోగేష్, నరేందర్, ప్రణయ్ తదితరులు పాల్గొన్నారు.

#### పాలాభిషేకం చేసిన వారే స్పందించాలి

స్కూల్ మంజూరైన సమయంలో ప్రభుత్వానికి పాలాభిషేకం చేసిన నాయకులు, ప్రజాప్రతినిధులు ఇప్పుడు తరలింపు అంశంపై స్పందించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. ఫార్మా పరిశ్రమలకు అనుమతులు వస్తున్న సమయంలో, విద్యార్థుల భవిష్యత్తుకు ఉపయోగపడే భారీ విద్యా ప్రాంగణాన్ని మాత్రం మరో ప్రాంతానికి ఎందుకు తరలిస్తున్నారని వారు ప్రశ్నిస్తున్నారు. భిక్కనూర్‌లోనే అనువైన స్థలాన్ని గుర్తించి స్కూల్ నిర్మాణం చేపట్టాలని కోరుతున్నారు.

# కామారెడ్డి అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

### వార్డుల్లో పర్యటన – సీసీ రోడ్లకు శంకుస్థాపన – స్టేడియం పనుల పరిశీలన






కామారెడ్డి, సెప్టెంబర్ 18 (నవజ్యోతి ప్రతినిధి): కామారెడ్డి పట్టణంలోని 15–16వ వార్డుల్లో ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ శుక్రవారం పర్యటించి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలను త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం పలు సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ప్రజలకు అవసరమైన రోడ్లు–డ్రైనేజీ–తాగునీరు–పారిశుధ్యం–వీధి దీపాలు వంటి మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నామని షబ్బీర్ అలీ తెలిపారు. సంక్షేమం–అభివృద్ధిని సమాంతరంగా కొనసాగిస్తున్నామని, ఇందిరమ్మ ఇళ్లు, ఉచిత విద్యుత్, కొత్త రేషన్ కార్డులు–సన్నబియ్యం తదితర పథకాలు అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. అనంతరం ఇందిరాగాంధీ స్టేడియంలో నిర్మిస్తున్న ఇండోర్ స్టేడియం–ఇతర అభివృద్ధి పనులను పరిశీలించి అధికారులతో సమీక్షించారు. క్రీడా రంగాన్ని బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని, గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు క్రీడా మౌలిక వసతులు కల్పిస్తామని తెలిపారు. స్టేడియం పనులను నాణ్యతతో–నిర్ణీత గడువులో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ మద్ది చంద్రకాంత్‌రెడ్డి, మాజీ డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్, కౌన్సిలర్లు ప్రియాంక సంతోష్, వనిత రామ్మోహన్, అంజాద్, వాజీద్, మజీద్, సిద్ధికి, గణేష్, చిట్టిబాబు, భూపతి, సత్యం, సొసైటీ చైర్మన్ గూడెం శ్రీనివాస్‌రెడ్డి, పండ్ల రాజు, అశోక్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, వైద్య కిషన్, నౌసిలాల్, గణేష్ నాయక్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు బాలరాజు, మాజీ గ్రంథాలయ చైర్మన్ పున్నమి రాజేశ్వర్, అధికారులు–నాయకులు పాల్గొన్నారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



బిక్కనూర్, సెప్టెంబర్ 18 (నవజ్యోతి ప్రతినిధి): బిక్కనూర్ మండలంలోని రామేశ్వర్‌పల్లి, లక్ష్మీదేవునిపల్లి, సన్నపల్లి, భగీరథిపల్లి గ్రామాలకు చెందిన మద్ది ప్రమోద్‌రెడ్డి, గంజి భారతి, రేగుల అనూష, నాగర్తి భాస్కర్‌రెడ్డి, ముత్తంగి గోపాల్‌రెడ్డి, రామారపు దేవయ్యలకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ సహకారంతో అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు సీఎంఆర్ఎఫ్ ద్వారా అందిన ఆర్థిక సాయానికి కృతజ్ఞతలు తెలిపారు.పాల్గొన్నవారు: టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, పీఏసీఎస్ రామేశ్వర్ పల్లి చైర్మన్ బద్దం ఇంద్రకరణ్‌రెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్‌రెడ్డి, రామేశ్వర్‌పల్లి సర్పంచ్ చేపూరి రాణి రాజు, ఉపసర్పంచ్ వినోద్‌గౌడ్, గ్రామ వీడీసీ అధ్యక్షుడు సూర్యకాంత్‌రెడ్డి, గ్రామ పార్టీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, వివిధ గ్రామాల సర్పంచులు–పార్టీ అధ్యక్షులు పాల్గొన్నారు.

## అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలపై నిరాహార దీక్ష

### హమారా ప్రసాద్ అరెస్టుతో దీక్ష విరమణ – పోలీసులకు ఫిర్యాదు



బిక్కనూర్, సెప్టెంబర్ 18 (నవజ్యోతి ప్రతినిధి): అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న హమారా ప్రసాద్‌ను అరెస్టు చేయాలని – 'కల్పిత నాయకుడు' పుస్తకాన్ని నిషేధించాలని డిమాండ్ చేస్తూ నారీగళ్ల రాజు, చెట్లపల్లి మల్లేష్, కోటిగళ్ల కిరణ్‌కుమార్ నిరాహార దీక్ష చేపట్టారు. వీరికి బీసీ నాయకులు, అంబేద్కర్ సంఘం నాయకులు–కాలనీ యువకులు మద్దతు తెలిపారు. హమారా ప్రసాద్‌ను పోలీసులు అరెస్టు చేయడంతో దీక్షను విరమించి అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. అనంతరం బిక్కనూర్ పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు: నారీగళ్ల రాజు, చెట్లపల్లి మల్లేష్, కిరణ్‌కుమార్, డీఎస్పీ జిల్లా నాయకులు, అంబేద్కర్ సంఘం నాయకులు, బీసీ నాయకులు–కాలనీ యువకులు పాల్గొన్నారు.

## ఎర్రవల్లిలో భారీగా పోలీసు బందోబస్తు

### – భూసర్వే నేపథ్యంలో కట్టుదిట్టమైన భద్రతా చర్యలు



గజ్వేల్ సెప్టెంబర్ 18 (నవజ్యోతి ప్రతినిధి):సిద్దిపేట జిల్లా గజ్వేల్ నియోజకవర్గ పరిధిలోని ఎర్రవల్లి గ్రామంలో తీవ్ర ఉత్కంఠ వాతావరణం నెలకొంది. ఎర్రవల్లి ప్రాంతంలో నిర్వహిస్తున్న భూసర్వేను పురస్కరించుకుని పోలీసులు భారీగా మోహరించారు. కమిషనర్ ఆఫ్ పోలీస్ (సీపీ) ఆదేశాల మేరకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు అత్యంత కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టారు.మాజీ ముఖ్యమంత్రి KCR ఫామ్‌హౌస్ పరిసర ప్రాంతాలలో ప్రస్తుతం భూసర్వే కొనసాగుతోంది. ఈ సర్వే ప్రక్రియ శాంతియుతంగా, ఎలాంటి ఆటంకాలు లేకుండా జరగడానికి ముందస్తు జాగ్రత్తగా అధికారులు భారీ పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేశారు.భూసర్వే జరుగుతున్న ప్రధాన ప్రాంతంతో పాటు దాని పరిసర ప్రాంతాలలోనూ పోలీసు బలగాలను భారీగా మోహరించారు. ఎర్రవల్లికి వెళ్లే ప్రధాన రహదారులు, కేసీఆర్ ఫామ్‌హౌస్ పరిసర ప్రాంతాలలో భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు.

# అనారోగ్యంతో బాధపడుతున్న మహిళకు రూ.5 లక్షల ఎల్‌వోసీ

### ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి చొరవ



బిక్కనూర్, సెప్టెంబర్ 18 (నవజ్యోతి ప్రతినిధి): బిక్కనూర్ మండలం తిప్పాపూర్ గ్రామానికి చెందిన గున్నల లక్ష్మి (భర్త భూమా గౌడ్) అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి వెంటనే స్పందించారు. తిప్పాపూర్ గ్రామానికి చెందిన బీజేపీ నాయకులు ఆమె అనారోగ్య పరిస్థితిని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లడంతో వైద్యం కోసం రూ.5 లక్షల ఎల్‌వోసీ మంజూరు చేయించారు. ఈ సహాయానికి గున్నల లక్ష్మి కుటుంబ సభ్యులు ఎమ్మెల్యేకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# గణేష్ నిమజ్జనంపై సన్నాహక సమావేశం

### డీజేలు — సౌండ్ సిస్టమ్‌లకు అనుమతి లేదు: ఎస్ఐ అనిల్



బిక్కనూర్, సెప్టెంబర్ 18 (నవజ్యోతి ప్రతినిధి): బిక్కనూర్ మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో గణేష్ నిమజ్జన సన్నాహక సమావేశం నిర్వహించారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం గణేష్ నిమజ్జన ఊరేగింపులో డీజేలు–సౌండ్ సిస్టమ్‌లకు అనుమతి లేదని ఎస్ఐ అనిల్ తెలిపారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు: ఎస్ఐ అనిల్, సర్పంచ్ రేఖా సుదర్శన్, ఈవో మహేష్‌కుమార్‌గౌడ్ పాల్గొన్నారు.

# అనుమతులు ఒకలా.. నిర్మాణం మరోలా!

### కైలాస్‌హిల్స్‌లో నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాల ఆరోపణలు



కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 18 (నవజ్యోతి ప్రతినిధి): గాజులరామారం సర్కిల్ పరిధిలోని మహదేవపురం డివిజన్ కైలాస్‌హిల్స్‌లో నిర్మాణ నిబంధనల అమలుపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్లాట్ నంబర్ 60, హౌస్ నంబర్ 02–067 సమీపంలో స్టిల్ట్+3 అంతస్తులతో జీరో సెట్‌బ్యాక్–వాణిజ్య నిర్మాణం కొనసాగుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. నిర్మాణానికి ఎంత మేరకు అనుమతులు ఉన్నాయి? ఆమోదిత ప్రణాళిక ప్రకారం సెట్‌బ్యాక్‌లు పాటిస్తున్నారా? వాణిజ్య వినియోగానికి అనుమతులు ఉన్నాయా? అనే అంశాలపై టౌన్‌ప్లానింగ్ అధికారులు స్పష్టత ఇవ్వాల్సి ఉంది. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణం జరుగుతోందన్న ఫిర్యాదులు వస్తే క్షేత్రస్థాయిలో తనిఖీ చేసి వాస్తవాలను వెల్లడించాలని స్థానికులు కోరుతున్నారు. ఉల్లంఘనలు నిర్ధారణ అయితే చర్యలు తీసుకుంటారా? నిర్మాణం పూర్తయ్యే వరకు వేచి చూస్తారా? అన్నదానిపై అధికారుల స్పందన కోసం స్థానికులు ఎదురుచూస్తున్నారు.<

# మిశ్రమ వ్యవసాయమే రైతుకు శ్రీరామరక్ష

### సమైక్య వ్యవసాయ విధానంతో నిరంతర ఆదాయం పొందాలి





రామాయంపేట, సెప్టెంబర్ 18 (నవజ్యోతి ప్రతినిధి రాజాగౌడ్): రామాయంపేట మండలం రాయలాపూర్ గ్రామంలో ఆత్మ (ATMA) ఆధ్వర్యంలో సమైక్య వ్యవసాయ విధానంపై రైతులకు రెండు రోజుల అవగాహన సదస్సు–క్షేత్రస్థాయి శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆత్మ డీపీడీ రుద్రమూర్తి, వ్యవసాయ శాఖ ఏడీఏ టెక్ విన్సెంట్ వినయ్, ఏడీఏ సోమలింగారెడ్డి మాట్లాడుతూ ఒకే పంటపై ఆధారపడకుండా ఉద్యానవనం, పాడిపరిశ్రమ, కోళ్ల–కుందేళ్ల పెంపకం, వర్మీకంపోస్ట్ వంటి అనుబంధ రంగాలను వ్యవసాయంతో అనుసంధానం చేసుకోవాలని సూచించారు. తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు పొందడంతో పాటు ఏడాది పొడవునా ఆదాయం పొందేందుకు సమైక్య వ్యవసాయం దోహదపడుతుందని రుద్రమూర్తి తెలిపారు. భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వినియోగించాలని, నీటి యాజమాన్య పద్ధతులతో సాగు ఖర్చులు తగ్గించుకోవాలని విన్సెంట్ వినయ్ సూచించారు. రాయలాపూర్ సమైక్య వ్యవసాయ ఆచరణలో ఆదర్శంగా నిలవాలని సోమలింగారెడ్డి ఆకాంక్షించారు. అనంతరం మండల వ్యవసాయ అధికారి ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో భూమగారి వెంకట్‌గౌడ్ వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించి అక్కడ అమలు చేస్తున్న మిశ్రమ వ్యవసాయ పద్ధతులను రైతులు పరిశీలించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గట్టు సుశీల, ఉపసర్పంచ్ రంజిత్, వ్యవసాయ విస్తరణ అధికారులు, రైతులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# ఫాక్స్ సాగర్ చుట్టూ 'వేస్ట్' కథ!





### కూల్చిన షెడ్‌లో మళ్లీ కార్యకలాపాలెలా?
### ఫైర్ సేఫ్టీ ఉందా?
### అనుమతి ఒకటి.. కార్యకలాపం మరొకటా?
### వ్యర్థాల కాల్చివేతపై పీసీబీ తనిఖీలు జరిగాయా?

కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 18 (నవజ్యోతి ప్రతినిధి): దూలపల్లి ఫాక్స్ సాగర్ పరిసరాల్లో సెప్టెంబర్ 10న జరిగిన అగ్నిప్రమాదం స్థానికుల్లో ఆందోళన కలిగించింది. ఇదే సమయంలో చెరువు పరిసరాల్లో కొనసాగుతున్నట్లు ఆరోపణలు వస్తున్న షెడ్లు, గోదాములు, వ్యర్థాల నిల్వ – దహనం, అనుమతులకు విరుద్ధంగా జరుగుతున్న కార్యకలాపాలపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. గతంలో బఫర్‌జోన్ పరిధిలో ఉందంటూ అధికారులు కూల్చివేసిన షెడ్‌లో కొంతకాలం కార్యకలాపాలు నిలిచిపోయినా.. గత కొన్ని నెలలుగా మళ్లీ కార్యకలాపాలు కొనసాగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

#### కూల్చిన షెడ్‌లో మళ్లీ కార్యకలాపాలా?

గతంలో అధికారులు చర్యలు తీసుకున్న ప్రాంతంలో తిరిగి నిర్మాణం లేదా కార్యకలాపాలు కొనసాగుతున్నాయా? కొనసాగితే అనుమతులు ఎవరు ఇచ్చారు? కూల్చివేత తర్వాత అధికారులు ఫాలోఅప్ తనిఖీలు చేశారా? అన్నది తేలాల్సి ఉంది.

#### ట్రేడ్ లైసెన్సు ఉంటే సరిపోతుందా?

కొన్ని ప్రాంగణాలకు ట్రేడ్ లైసెన్సులు ఉన్నప్పటికీ.. వాస్తవంగా అక్కడ ఏ కార్యకలాపాలు జరుగుతున్నాయన్నదే కీలకం. లైసెన్సులో పేర్కొన్న కార్యకలాపాలకే పరిమితమవుతున్నారా? లేక ఇతర పదార్థాల నిల్వ, నిర్వహణ జరుగుతోందా? అన్నది క్షేత్రస్థాయిలో పరిశీలించాల్సి ఉంది.

#### మెడికల్ వేస్ట్ — రసాయనాల నిల్వపై అనుమానాలు

మెడికల్ వేస్ట్, రసాయనాల డ్రమ్ములు, ఇతర మెటీరియల్‌ను ఫాక్స్ సాగర్ సమీపంలో డంప్ చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ పదార్థాలు ఎక్కడి నుంచి వస్తున్నాయి? ఎవరు తరలిస్తున్నారు? ఎక్కడ నిల్వ చేస్తున్నారు? వాటి నిర్వహణకు సంబంధిత అనుమతులు ఉన్నాయా? అన్నదానిపై అధికారులు స్పష్టత ఇవ్వాల్సి ఉంది.

#### రాత్రివేళల్లో వ్యర్థాల దహనమా?

రాత్రి సమయాల్లో వ్యర్థాలను కాల్చుతున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. కాల్చిన ఆనవాళ్లు ఉన్నాయని స్థానికులు చెబుతున్నారు. ఈ అంశంపై తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి వాస్తవాలను నిర్ధారించాల్సిన అవసరం ఉంది.

#### ఫైర్ సేఫ్టీపై నిఘా ఏది?

రసాయనాలు, ప్రమాదకర పదార్థాలు నిల్వ చేసే ప్రాంతాల్లో అగ్నిమాపక భద్రత కీలకం. అగ్నిప్రమాదం జరిగిన నేపథ్యంలో పరిసరాల్లోని షెడ్లు, గోదాముల్లో ఫైర్ సేఫ్టీ ప్రమాణాలు అమలవుతున్నాయా? అత్యవసర రక్షణ ఏర్పాట్లు ఉన్నాయా? అన్నదానిపై ఫైర్ శాఖ సమగ్ర తనిఖీలు చేపట్టాల్సి ఉంది.

#### రెసిడెన్షియల్ అనుమతి.. కమర్షియల్ కార్యకలాపాలా?

రెసిడెన్షియల్ అనుమతులు తీసుకుని కమర్షియల్ కార్యకలాపాలు నిర్వహిస్తున్నారనే ఆరోపణలు కూడా ఉన్నాయి. భవన వినియోగం అనుమతులకు అనుగుణంగా ఉందా? అన్నది సంబంధిత అధికారులు రికార్డులు, క్షేత్రస్థాయి పరిస్థితులను పరిశీలించి తేల్చాల్సి ఉంది.

#### అనుమతులు లేకుండానే కార్యకలాపాలా?

కొన్ని చోట్ల సంబంధిత శాఖల అనుమతులు లేకుండానే కార్యకలాపాలు సాగుతున్నాయనే ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో.. ఫాక్స్ సాగర్ పరిసరాల్లోని షెడ్లు, గోదాములు, పరిశ్రమలపై సమగ్ర సర్వే నిర్వహించి అనుమతులను పరిశీలించాలని స్థానికులు కోరుతున్నారు.

#### పీసీబీ తనిఖీలు జరిగాయా?

వ్యర్థాల నిల్వ, నిర్వహణ, దహనంపై ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో పీసీబీ అధికారులు ఇప్పటివరకు ఎలాంటి తనిఖీలు నిర్వహించారు? ఉల్లంఘనలు గుర్తించారా? గుర్తిస్తే ఎలాంటి చర్యలు తీసుకున్నారు? అనే ప్రశ్నలకు సమాధానం రావాల్సి ఉంది. రాత్రివేళల్లో దహనం జరుగుతోందనే ఆరోపణలు ఉన్నందున అవసరమైన సందర్భాల్లో రాత్రి తనిఖీలు కూడా చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

#### చెరువు చుట్టూ సమగ్ర సర్వేకు డిమాండ్

ఫాక్స్ సాగర్ చుట్టూ ఉన్న షెడ్లు, గోదాములు, పరిశ్రమలపై మున్సిపల్, ఫైర్, పీసీబీ, రెవెన్యూ తదితర శాఖలు సమన్వయంతో సమగ్ర సర్వే చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఎన్ని యూనిట్లకు అనుమతులు ఉన్నాయి? ఎక్కడ అనుమతులకు విరుద్ధంగా కార్యకలాపాలు జరుగుతున్నాయి? ఎక్కడ వ్యర్థాలు నిల్వ లేదా దహనం చేస్తున్నారు? అనే అంశాలను అధికారులు తేల్చాలని కోరుతున్నారు.అగ్నిప్రమాదం తర్వాత స్పందించడం కంటే.. ప్రమాదాలకు కారణమయ్యే అవకాశం ఉన్న కార్యకలాపాలపై ముందస్తు నిఘా, భద్రతా తనిఖీలు, వ్యర్థాల నిర్వహణపై పర్యవేక్షణ అవసరమని స్థానికులు పేర్కొంటున్నారు. సెప్టెంబర్ 10న జరిగిన అగ్నిప్రమాదానికి గల కారణాలపై అధికారిక దర్యాప్తుతో పాటు ఫాక్స్ సాగర్ పరిసరాల్లోని కార్యకలాపాలపై సమగ్ర తనిఖీ జరిగితే వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని వారు అంటున్నారు.

# ప్రభుత్వ హామీల అమలుపై శ్వేతపత్రం విడుదల చేయాలి

### ఎర్రవల్లి భూములపై రికార్డులతో వాస్తవాలు తేల్చాలి: అంబటి బాలచందర్‌గౌడ్



గజ్వేల్, సెప్టెంబర్ 18 (నవజ్యోతి ప్రతినిధి): తిమ్మారెడ్డిపల్లి కళింగపట్నం హోటల్‌లో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు అంబటి బాలచందర్‌గౌడ్ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలుపై స్పష్టమైన లెక్కలు ప్రజల ముందుంచాలని డిమాండ్ చేశారు. మహిళలకు నెలకు రూ.2,500, కౌలు రైతులకు ఆర్థిక సాయం, విద్యార్థులకు భరోసా కార్డు తదితర హామీల పరిస్థితిని ప్రభుత్వం వెల్లడించాలని కోరారు. ఎర్రవల్లి సర్వే నంబర్ 325 భూముల విషయంలో రాజకీయ ఆరోపణలు కాకుండా రెవెన్యూ రికార్డులు–పాత పత్రాలు–క్షేత్రస్థాయి వాస్తవాల ఆధారంగా నిజానిజాలు తేల్చాలని అన్నారు. ప్రజా సమస్యలపై ప్రతిపక్షాలు ప్రశ్నిస్తే కేసులు–అరెస్టులు–సస్పెన్షన్లు, నిరసనలపై ఆంక్షలు విధించడం ప్రజాస్వామ్య చర్చపై ప్రశ్నలు తలెత్తేలా చేస్తోందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు: బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు–బీఆర్ఆర్ ఫౌండేషన్ అధ్యక్షుడు బొంగు రాజేందర్‌రెడ్డి, తిమ్మారెడ్డిపల్లి గ్రామ అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల నాయకులు పాండు గౌడ్, రేపాక యాదగిరి, సద్దుపల్లి గౌడ్, మర్మాండ్ల కిషన్, అర్పుల రాజు తదితరులు పాల్గొన్నారు.

# బాపనయ్య తండా విద్యార్థులకు యూనిఫామ్‌ల పంపిణీ

### విద్యాభివృద్ధికి అవసరమైన సహకారం అందిస్తాం: సర్పంచ్ తార్య నాయక్



రామాయంపేట, సెప్టెంబర్ 18 (నవజ్యోతి ప్రతినిధి రాజాగౌడ్): రామాయంపేట మండలం పర్వతాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని బాపనయ్య తండా ఎంపీపీఎస్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు సర్పంచ్ తార్య నాయక్ ఆధ్వర్యంలో శుక్రవారం యూనిఫామ్ దుస్తులు పంపిణీ చేశారు. విద్యార్థుల అవసరాలను గుర్తించి యూనిఫామ్‌లు అందించడంపై తల్లిదండ్రులు–ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. అనంతరం సర్పంచ్ తార్య నాయక్‌ను గ్రామస్తులు–పాఠశాల సిబ్బంది శాలువాతో సన్మానించారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి అవసరమైన సహకారం అందించేందుకు ముందుంటామని సర్పంచ్ తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ కట్ట ఈశ్వర్, పంచాయతీ కార్యదర్శి లక్ష్మి, ఉపాధ్యాయురాలు ఎన్.రజిత, రెడ్డిశెట్టి శేఖర్, కాముని సంతోష్, దప్పు భూదయ్య, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# కొబ్బరికాయలో వినాయకుడు..

### కొబ్బరికాయపై వినాయకుడి ప్రతిమ చెక్కిన రామకోటి రామరాజు



గజ్వేల్, సెప్టెంబర్ 18 (నవజ్యోతి ప్రతినిధి): గజ్వేల్ పట్టణానికి చెందిన రామకోటి భక్త సమాజం వ్యవస్థాప కులు–భక్తిరత్న జాతీయ అవార్డు గ్రహీత రామ కోటి రామరాజు కొబ్బరికాయలో వినాయ కుడి ప్రతిమను కళాత్మకం గా చెక్కి ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ ప్రతి ఒక్క రూ వినాయక నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలని కోరారు.

## గణనాథుని పూజలో పాల్గొన్న మారుతి కిరణ్ బూనేటి



పరిగి, సెప్టెంబర్ 18 (నవజ్యోతి ప్రతినిధి): పూడూరు మండలం చంగోముల్ గ్రామంలో బీజేవైఎం పరిగి అసెంబ్లీ కో–కన్వీనర్ మనోహర్‌గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన గణనాథుని పూజా కార్యక్రమంలో బీజేపీ పరిగి అసెంబ్లీ ఇన్‌చార్జ్ మారుతి కిరణ్ బూనేటి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గణనాథుడి ఆశీస్సులతో ప్రజలందరికీ సుఖసంతోషాలు–ఆయురారోగ్యాలు–శ్రేయస్సు కలగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు మల్లేష్ పటేల్, పూడూరు మండల అధ్యక్షుడు రాఘవేందర్, దోమ మండల మాజీ అధ్యక్షుడు శేరి రాంరెడ్డి, నస్కల్ గ్రామ మాజీ సర్పంచ్ శ్రీనివాస్, బీజేపీ వికారాబాద్ జిల్లా ధార్మిక సెల్ జాయింట్ కన్వీనర్ జాక సురేష్‌బాబు, బీజేపీ నాయకులు కంకల్ రవీందర్, రాజు, ప్రకాష్ యాదవ్, మంచంపల్లి నర్సింలు, శ్రీశైలం, రాజేష్‌గౌడ్, అజయ్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.

## శివ్వంపేట ప్రజలకు కోతుల నుంచి ఊరట

### సొంత ఖర్చుతో రూ.5 లక్షలు వెచ్చించి అడవులకు తరలింపు



శివ్వంపేట, సెప్టెంబర్ 18 (నవజ్యోతి ప్రతినిధి ఆకుల శ్రీనివాస్): మెదక్ జిల్లా శివ్వంపేట మండల కేంద్రంలో ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న కోతుల సమస్య పరిష్కారానికి ప్రముఖ సంఘ సేవకులు–మాజీ జెడ్పీటీసీ సభ్యుడు పబ్బ మహేష్‌గుప్తా చొరవ తీసుకున్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు తన సొంత నిధులతో రూ.5 లక్షలు వెచ్చించి ఇనుప జాలీలు, ప్రత్యేక వాహనం–సిబ్బందిని ఏర్పాటు చేసి కోతులను బంధించి అడవుల్లోకి తరలిస్తున్నారు. జంతు సంరక్షణ నిబంధనల ప్రకారం కోతులకు ఎలాంటి హాని కలగకుండా పట్టుకుని నిర్మల్ అటవీ ప్రాంతంలో వదులుతున్నట్లు తెలిపారు. రోజుకు 100 నుంచి 200 కోతులను పట్టుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని సర్పంచ్ రాజీపేట వెంకటేశ్వర్లు, ఉపసర్పంచ్ ఇసుగారి మల్లేష్, మాజీ సర్పంచ్ పత్రాల శ్రీనివాస్‌గౌడ్ పర్యవేక్షిస్తున్నారు. ప్రజా సమస్య పరిష్కారానికి సొంత నిధులు వెచ్చిస్తున్న మహేష్‌గుప్తాను స్థానికులు అభినందిస్తున్నారు.

## బీసీ రాజ్యాధికారమే లక్ష్యం

### గోల్కొండ కోట నుంచి బీసీ రాజ్యాధికార యాత్ర

### – తీన్మార్ మల్లన్నతో కలిసి పనగట్ల చక్రపాణి గౌడ్



ఉప్పల్, సెప్టెంబర్ 18 (నవజ్యోతి ప్రతినిధి): బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం–సామాజిక న్యాయం–సమాన అవకాశాల కల్పన లక్ష్యంగా టీఆర్‌పీ అధ్యక్షుడు తీన్మార్ మల్లన్న గోల్కొండ కోట నుంచి ప్రారంభించిన బీసీ రాజ్యాధికార యాత్ర కొనసాగుతోంది. ఈ యాత్రలో టీఆర్‌పీ మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లా అధ్యక్షుడు పనగట్ల చక్రపాణిగౌడ్, రాష్ట్ర యువజన విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ సింగం అరుణ్ పటేల్ పాల్గొంటున్నారు. తీన్మార్ మల్లన్నతో కలిసి పాదయాత్రలో అడుగులు వేస్తూ కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్తున్నారు. ఈ సందర్భంగా చక్రపాణిగౌడ్ మాట్లాడుతూ గోల్కొండ కోట నుంచి ప్రారంభమైన బీసీ రాజ్యాధికార యాత్ర బీసీల రాజకీయ చైతన్యానికి నాంది అని అన్నారు. జనాభా ప్రాతిపదికన బీసీలకు తగిన రాజకీయ ప్రాతినిధ్యం–హక్కులు–అవకాశాలు కల్పించాలనే డిమాండ్‌తో ప్రజాస్వామ్య పద్ధతిలో ఉద్యమాన్ని కొనసాగిస్తామని తెలిపారు. మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లాలో బీసీ యువత–మహిళలు–ఉద్యోగులు–కార్మికులను ఉద్యమంతో అనుసంధానం చేసేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. బీసీ రాజ్యాధికార సాధన కోసం జరిగే ప్రజాస్వామ్య కార్యక్రమాల్లో ముందుండి భాగస్వామ్యం అవుతామని సింగం అరుణ్ పటేల్ తెలిపారు.

## ముట్టడికి ముందే అరెస్టులు.. సమస్యల పరిష్కారం ఎప్పుడు?

### ముట్టడిని ఆపారు.. సమస్యలను ఆపగలరా? – అరెస్టైన జేఏసీ నేతలకు ఎంఆర్పీఎస్ సంఘీభావం

కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 18 (నవజ్యోతి ప్రతినిధి): స్వచ్ఛ ఆటో కార్మికుల సమస్యల పరిష్కారం కోసం మున్సిపల్ కార్యాలయ ముట్టడికి జేఏసీ పిలుపునివ్వగా పోలీసులు ముందస్తుగా నాయకులను అరెస్టు చేశారు. తెలంగాణ స్టేట్ స్వచ్ఛ ఆటో టిప్పర్ జేఏసీ చైర్మన్ ఎత్తరి గోపి, హెచ్‌ఎంఎస్ అధ్యక్షుడు ఎడపాక వీరేష్, చెవిటి వెంకన్న, రాజు, రామంజి తదితరులను అదుపులోకి తీసుకుని జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కార్మికుల సమస్యలపై అధికారులను ప్రశ్నించేందుకు చేపట్టిన కార్యక్రమానికి ముందే నాయకులను అరెస్టు చేయడం చర్చనీయాంశంగా మారిందని జేఏసీ నాయకులు పేర్కొన్నారు. స్వచ్ఛ ఆటో కార్మికుల జీవనోపాధికి సంబంధించిన సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించాలని కోరారు. పోలీస్‌స్టేషన్‌లో ఉన్న జేఏసీ నాయకులను ఎంఆర్పీఎస్ నాయకులు డప్పు రామస్వామి, తొండ వెంకటన్న, ప్రవీణ్ తదితరులు పరామర్శించి సంఘీభావం తెలిపారు. కార్మికుల సమస్యలను ప్రభుత్వం–మున్సిపల్ అధికారులు తక్షణమే పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

## తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల ముగింపు



నడిగూడెం, సెప్టెంబర్ 18 (నవజ్యోతి ప్రతినిధి షేక్ నజరుద్దీన్): తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల ముగింపు సందర్భంగా శుక్రవారం కరివిరాల గ్రామంలో సీపీఎం ఆధ్వర్యంలో పోరాట యోధుడు కామ్రేడ్ గట్టు గోపాలకృష్ణయ్య స్తూపం వద్ద ఎర్రజెండా ఎగురవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి బెల్లంకొండ సత్యనారాయణ – జిల్లా కమిటీ సభ్యులు బెల్లంకొండ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ భూమి కోసం – భుక్తి కోసం – వెట్టిచాకిరి విముక్తి కోసం – పీడిత ప్రజల విముక్తి కోసం గట్టు గోపాలకృష్ణయ్య పోరాడి ప్రాణత్యాగం చేశారని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు కోరుట్ల శ్రీనివాస్, ఎస్కే మస్తాన్, పుచ్చ అంజయ్య, గార్లపాటి వెంకట్‌రెడ్డి, సర్దార్ హుస్సేన్, రణబోతు సతీష్‌రెడ్డి, శాఖ కార్యదర్శి కేసగాని భద్రయ్య, మిడిదొడ్డి నాగయ్య, మర్రిపల్లి పాపయ్య పాల్గొన్నారు.

# బీసీలకు రాజకీయ వాటా దక్కే వరకు పోరాటం

## శంషాబాద్ చేరుకున్న తీన్మార్ మల్లన్న బీసీ రాజ్యాధికార యాత్ర



రాజేంద్రనగర్, సెప్టెంబర్ 18 (నవజ్యోతి ప్రతినిధి): బీసీలకు సముచిత రాజకీయ ప్రాతినిధ్యం – రాజ్యాధికారంలో భాగస్వామ్యం కల్పించాలనే లక్ష్యంతో తెలంగాణ రాజ్యాధికార పార్టీ అధినేత – ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న చేపట్టిన బీసీ రాజ్యాధికార యాత్ర రెండో రోజు శంషాబాద్‌లో ముగిసింది. శుక్రవారం జియాగూడ నుంచి ప్రారంభమైన పాదయాత్ర ఆరాంఘర్ – గగన్‌పహాడ్ మీదుగా శంషాబాద్‌కు చేరుకుంది. పలుచోట్ల ప్రజలు – పార్టీ శ్రేణులు యాత్రకు స్వాగతం పలికారు. స్థానికులతో మాట్లాడిన మల్లన్న వారి సమస్యలను తెలుసుకున్నారు. జీహెచ్‌ఎంసీ కార్మికులు తమకు శ్రమకు తగ్గ వేతనాలు – ఉద్యోగ భద్రత లేదని సమస్యలను వివరించగా, వారి హక్కుల కోసం పోరాడుతానని మల్లన్న హామీ ఇచ్చారు. ఏజెన్సీ విధానంలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం ఉద్యమిస్తానని పేర్కొన్నారు. యాత్ర మూడో రోజు శనివారం ఉదయం 8 గంటలకు శంషాబాద్ నుంచి ప్రారంభమై పాలమాకుల – తిమ్మాపూర్ మీదుగా కొత్తూరు – నందిగామ మండలాల్లోని ప్రధాన కూడళ్లకు చేరుకోనుంది. ఆయా ప్రాంతాల్లో బహిరంగ సమావేశాలు నిర్వహించనున్నట్లు పార్టీ నాయకులు తెలిపారు.

## నూతన గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి భూమిపూజ



నడిగూడెం, సెప్టెంబర్ 18 (నవజ్యోతి ప్రతినిధి షేక్ నజీరుద్దీన్): మండలంలోని వల్లాపురం గ్రామంలో నూతన గ్రామపంచాయతీ – మహిళా సమైక్య భవనాల నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు. ఉపాధి హామీ పథకం కింద రూ.30 లక్షలతో నిర్మించనున్న భవనాలకు ఎంపీడీవో మల్సూర్ నాయక్ – సర్పంచ్ కేసగాని సరిత లక్ష్మణ్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భవనాల నిర్మాణం పూర్తయితే ప్రజలకు పరిపాలన సేవలు మరింత అందుబాటులోకి వస్తాయని, సంక్షేమ పథకాల అమలుకు సమావేశాలు నిర్వహించేందుకు ఉపయోగకరంగా ఉంటాయని తెలిపారు. అధికారులు – ప్రజాప్రతినిధులు అందుబాటులో ఉండేందుకు భవనాలు దోహదపడతాయని, నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఈపీఆర్ లావణ్య, గ్రామ కార్యదర్శి రణబోతు మల్లారెడ్డి, ఉప సర్పంచ్ కోట చంద్రశేఖర్‌రెడ్డి, వార్డు సభ్యులు, మహిళా సమైక్య సభ్యులు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు వల్లపురెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, నిండుచర్ల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కరించడంలో.. నిర్లక్ష్యమా?

### సర్పంచ్‌లు చెప్పిన సమస్యలు పట్టవా?

### – గైర్హాజరైన అధికారులపై చర్యలకు సభ్యుల తీర్మానం

హత్నూర, సెప్టెంబర్ 18 (నవజ్యోతి ప్రతినిధి): గ్రామాల్లో నెలకొన్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్తున్నా పరిష్కారానికి నోచుకోవడం లేదని సర్పంచ్‌లు ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం ఇన్‌చార్జి ఎంపీడీవో యూసుఫ్ అధ్యక్షతన మండల సాధారణ సమావేశం నిర్వహించారు. గుండ్ల మాచునూర్ సర్పంచ్ శ్రీహరి పాఠశాల విద్యార్థులకు సరిపోని యూనిఫామ్‌లను మార్చాలని కోరగా, పరిశ్రమలకు మిషన్ భగీరథ నీటి సరఫరా కారణంగా గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు ఏర్పడుతున్నాయని సర్పంచ్‌లు నవీన్‌గౌడ్, శ్రీహరి తెలిపారు. పరిశ్రమలకు నీటి సరఫరాను నిలిపివేయాలని గత సమావేశంలో కోరినా చర్యలు తీసుకోలేదన్నారు. గ్రామాల అభివృద్ధికి పరిశ్రమల సీఎస్ఆర్ నిధుల నుంచి ఒక్కో పంచాయతీకి రూ.20 లక్షలు కేటాయించాలని కోరారు. సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో తాగునీటి సమస్యతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని వైద్యాధికారి రజిని తెలిపారు. పౌతి మార్పిడికి ప్రభుత్వ ఉద్యోగి సాక్షిగా సంతకం చేయాలన్న నిబంధనతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని శ్రీహరి తహసీల్దార్ ఫర్వీన్ షేక్ దృష్టికి తీసుకెళ్లారు. కాసాల గ్రామానికి రెండేళ్లుగా మిషన్ భగీరథ నీరు అందడం లేదని సర్పంచ్ వెంకటేశం తెలిపారు. సమావేశానికి గైర్హాజరైన వివిధ శాఖల అధికారులపై జిల్లా అధికారులకు నివేదిక సమర్పిస్తామని ఇన్‌చార్జి ఎంపీడీవో యూసుఫ్ తెలిపారు. కార్యక్రమంలో నాయబ్ తహసీల్దార్ దావూద్ అహ్మద్, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖల మండల అధికారులు పాల్గొన్నారు.

## డీజేఎఫ్ రాష్ట్ర మహాసభల వాల్ పోస్టర్ విడుదల



హత్నూర, సెప్టెంబర్ 18 (నవజ్యోతి ప్రతినిధి): దళిత జర్నలిస్టుల ఫోరం (డీజేఎఫ్) ఆధ్వర్యంలో అక్టోబర్ 7న సంగారెడ్డిలో నిర్వహించనున్న 11వ రాష్ట్ర మహాసభల వాల్ పోస్టర్‌ను శుక్రవారం హత్నూర మండల పరిషత్ కార్యాలయం వద్ద ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు తలారి యాదగిరి మాట్లాడుతూ ప్రభుత్వానికి – ప్రజలకు వారధిగా సేవలందిస్తున్న దళిత జర్నలిస్టులకు సరైన సంక్షేమ పథకాలు అందడం లేదన్నారు. పనిచేస్తున్న దళిత జర్నలిస్టులకు అభయహస్తం కింద రూ.12 లక్షలు, హెల్త్ కార్డులు, ఇళ్ల స్థలాలు – ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. మహాసభల్లో దళిత జర్నలిస్టుల సంక్షేమానికి సంబంధించిన డిమాండ్లను ప్రవేశపెట్టనున్నట్లు తెలిపారు. జిల్లాలోని దళిత జర్నలిస్టులు అధిక సంఖ్యలో హాజరై మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డీజేఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దేవదాస్, ఉమ్మడి మెదక్ అధ్యక్షుడు రాపాక విజయ్‌రాజు, జిల్లా కమిటీ సలహాదారు మీనంపల్లి కిషన్‌రావు, జిల్లా కార్యదర్శి ముక్కగళ్ళ యాదన్న, కార్యవర్గ సభ్యులు పరమేశుల కిష్టయ్య, ఆవుల మల్లేశం, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కర్రె క్రిష్ణ, సర్పంచ్‌లు బి. శ్రీహరి, బి. యాదగిరి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ధనంపల్లి సత్యం తదితరులు పాల్గొన్నారు.

## మల్కాజ్‌గిరి అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయండి

### జోనల్ కమిషనర్ సంచిత్ గంగ్వార్ ఐఏఎస్‌ను కోరిన ఎమ్మెల్యే మర్రి



అల్వాల్, సెప్టెంబర్ 18 (నవజ్యోతి ప్రతినిధి): మల్కాజ్‌గిరి నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసి, కొత్తగా ప్రతిపాదించిన పనులకు నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి జోనల్ కమిషనర్ సంచిత్ గంగ్వార్ ఐఏఎస్‌ను కోరారు. శుక్రవారం జోనల్ కమిషనర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. స్మశానవాటికల అభివృద్ధి, ఓపెన్ జిమ్‌లు, పార్కుల అభివృద్ధి, బాక్స్ డ్రెయిన్లు, సీసీ రోడ్ల నిర్మాణంతో పాటు పెండింగ్ అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలని కోరారు. ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు జీహెచ్‌ఎంసీ పరిధిలో పనులను వేగవంతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఎమ్మెల్యే ప్రతిపాదనలపై జోనల్ కమిషనర్ సానుకూలంగా స్పందించి, పనులను పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డీఈ లౌక్య, మాజీ కార్పొరేటర్ జగదీష్‌గౌడ్, బీఆర్ఎస్ నాయకులు బద్దం పరశురాంరెడ్డి, ప్రభాకర్‌గౌడ్, లక్ష్మణ్‌యాదవ్, వెంకటేష్‌యాదవ్, మల్లేష్‌యాదవ్, నర్సింగ్‌రావు, బాలకృష్ణ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## వినాయక నిమజ్జన ఏర్పాట్లపై మున్సిపల్ చైర్‌పర్సన్ పరిశీలన

### ఎక్కలి దేవ్ చెరువును సందర్శించిన గజవాడ లావణ్య నాగరాజు



రామాయంపేట, సెప్టెంబర్ 18 (నవజ్యోతి ప్రతినిధి రాజాగౌడ్): రామాయంపేట మున్సిపల్ పరిధిలోని గోలిపర్తి గ్రామంలో వినాయక నిమజ్జన ఏర్పాట్లను మున్సిపల్ చైర్‌పర్సన్ గజవాడ లావణ్య నాగరాజు శుక్రవారం ఎక్కలి దేవ్ చెరువును సందర్శించి పరిశీలించారు. నిమజ్జనానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు లేకుండా పారిశుధ్యం, తాగునీరు, విద్యుత్, లైటింగ్, భద్రత తదితర సౌకర్యాలు కల్పించాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. చెరువు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు ముందస్తు ఏర్పాట్లను పూర్తిచేసి భక్తులకు సౌకర్యవంతమైన వాతావరణం కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ పోచమ్మల నవనీత గణేష్, శానిటేషన్ ఎస్ఐ వనిత, కౌన్సిలర్ పుట్టి సందీప్, పట్టణ అధ్యక్షుడు చింతల స్వప్న స్వామి, మట్టి యాదగిరి, ఎర్రం సత్యం, వంశీ, రాములు, సిద్ధరాములు, కనకరాజు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## నల్లగొండను కరువు జిల్లాగా ప్రకటించాలి

### కరువు పరిస్థితులపై సమగ్ర సర్వే నిర్వహించి రైతులకు తక్షణ సహాయం అందించాలి



నల్లగొండ, సెప్టెంబర్ 18 (నవజ్యోతి ప్రతినిధి): జిల్లాలో నెలకొన్న కరువు పరిస్థితుల దృష్ట్యా నల్లగొండను కరువు ప్రభావిత జిల్లాగా ప్రకటించి రైతులకు తక్షణ సహాయ చర్యలు చేపట్టాలని ఏఐకేఎంఎస్ డిమాండ్ చేసింది. ఈ మేరకు జిల్లా కలెక్టరేట్‌లో డీఆర్ఓకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఏఐకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి అంబటి చిరంజీవి – ఉపాధ్యక్షుడు గజ్జి రవి మాట్లాడుతూ వర్షాభావం, సాగునీటి కొరత, పెరుగుతున్న పెట్టుబడి వ్యయంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రతి మండలంలో పంటల పరిస్థితి, వర్షపాతం, సాగునీటి లభ్యత, భూగర్భజలాలు, పంట నష్టంపై సమగ్ర సర్వే నిర్వహించి, నివేదిక ఆధారంగా కరువు సహాయక చర్యలు చేపట్టాలని కోరారు. పంట నష్టపరిహారం, రుణ ఉపశమనం, రుణ చెల్లింపుల ఒత్తిడి నుంచి రైతులకు రక్షణ కల్పించాలని, పంటలు సాగు చేయలేని రైతులు – వ్యవసాయ కూలీలకు ఉపాధి హామీ పనులు విస్తృతంగా చేపట్టాలని డిమాండ్ చేశారు. పశువులకు పశుగ్రాసం – తాగునీరు, గ్రామాల్లో తాగునీటి సౌకర్యం కల్పించడంతో పాటు ఎండిపోయిన చెరువులు, కుంటలు, చెక్‌డ్యామ్‌లను పునరుద్ధరించాలని కోరారు. గ్రామస్థాయిలో రైతులు – రైతు సంఘాలతో చర్చించి వాస్తవ పరిస్థితులను అంచనా వేయాలని, ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా కోశాధికారి పుట్ట సత్తయ్య, జిల్లా నాయకులు కల్లూరి అయోధ్య, బొమ్మిడి నగేష్, బొంగరాల నర్సింహా, బి.వి. చారి, రావుల వీరేష్, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

## ఊపిరి ఆడని మిర్యాలగూడ

### రైస్ మిల్లుల కాలుష్యంతో ప్రజల ఆరోగ్యానికి ముప్పు – విస్తృత తనిఖీలు నిర్వహించాలి




మిర్యాలగూడ, సెప్టెంబర్ 18 (నవజ్యోతి ప్రతినిధి): రైస్ మిల్లుల నుంచి వెలువడుతున్న పొగ, బూడిద, ధాన్యం దుమ్ము – వ్యర్థ జలాలతో మిర్యాలగూడ పట్టణ పరిసరాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు సురేష్ యాదవ్ ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ కొన్ని రైస్ మిల్లులు నిబంధనలు పాటించకపోవడం వల్ల బాయిలర్ల నుంచి పొగ – బూడిద, ధాన్యం దుమ్ము వెలువడుతున్నాయని ఆరోపించారు. రాత్రివేళల్లో పొగ – దుర్వాసన ఎక్కువగా వస్తుండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కొన్ని మిల్లుల నుంచి వ్యర్థ జలాలను శుద్ధి చేయకుండా కాలువలు, ఖాళీ ప్రదేశాలు – వ్యవసాయ భూముల్లోకి వదులుతున్నట్లు ఆరోపించారు. కాలుష్య నియంత్రణ మండలి – సంబంధిత శాఖల అధికారులు రైస్ మిల్లుల్లో విస్తృత తనిఖీలు నిర్వహించి బాయిలర్ల కాలుష్య నియంత్రణ పరికరాలు, వ్యర్థ జలాల శుద్ధి కేంద్రాలు, అగ్నిమాపక భద్రత, ఊక – బూడిద నిల్వ, తరలింపు తదితర అంశాలను పరిశీలించాలని కోరారు. మిల్లుల పరిసరాల్లో గాలి – నీటి నమూనాలు సేకరించి పరీక్షలు నిర్వహించాలని, అవసరమైతే పగలు – రాత్రి ఆకస్మిక తనిఖీలు చేపట్టాలని డిమాండ్ చేశారు. నిబంధనలు ఉల్లంఘించే మిల్లులపై కఠిన చర్యలు తీసుకోవాలని, అధికారులు స్పందించకపోతే ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం బీసీ సంఘం ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని సురేష్ యాదవ్ హెచ్చరించారు.

## ఎమ్మార్వోకు వినతిపత్రం అందజేసిన రైస్ మిల్లర్స్

**కొనసాగుతున్న రైస్ మిల్లర్స్ నిరవధిక సమ్మె**



గజ్వేల్, సెప్టెంబర్ 18 (నవజ్యోతి ప్రతినిధి): గజ్వేల్‌లో రైస్ మిల్లర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఐఓసీ కార్యాలయంలో ఎమ్మార్వోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గజ్వేల్ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్.బి. ప్రభాకర్, బాల నారాయణ మాట్లాడుతూ రైస్ మిల్లర్లు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. మిల్లర్ల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరిని వీడాలని కోరారు. రైస్ మిల్లింగ్ రంగంపై ఆధారపడి వేలాది కుటుంబాలు జీవిస్తున్నాయని, మిల్లర్ల నిరవధిక సమ్మెతో కార్మికులు–అనుబంధ సంస్థల వారు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.ఈ కార్యక్రమంలో కోశాధికారి తోట చంద్రశేఖర్, సభ్యులు మల్యాల వెంకటేశం, బిక్కుమల్ల సంతోష్‌కుమార్, సతీష్, బచ్చు నాగరాజు, శివ, ప్రవీణ్, రాచర్ల శ్రీనివాస్, నాగరాజ్, అశోక్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## కాట్రియాల్‌లో ఘనంగా గణేష్ నవరాత్రి ఉత్సవాలు

**పలు మండపాల వద్ద ప్రత్యేక పూజలు – భక్తులకు అన్నదానం**



రామాయంపేట, సెప్టెంబర్ 18 (నవజ్యోతి ప్రతినిధి రాజాగౌడ్): రామాయంపేట మండలం కాట్రియాల్ గ్రామంలో గణేష్ నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. పలు గణేష్ మండపాల వద్ద నిర్వాహకులు ప్రత్యేక పూజలు–అభిషేకాలు నిర్వహించి నైవేద్యాలు సమర్పించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని గణనాథుడిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మండపాల నిర్వాహకుల ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. గణేష్ మండపాల వద్ద భక్తిగీతాలు–పూజా కార్యక్రమాలతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. యువత–మహిళలు–గ్రామస్థులు ఉత్సవాల్లో ఉత్సాహంగా పాల్గొంటున్నారు. గ్రామ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని గణనాథుడిని ప్రార్థించినట్లు నిర్వాహకులు తెలిపారు.

## భక్తి వేడుకల్లో ప్రజలతో మమేకం


**గణేష్ మండపాల సందర్శన – అన్నదానంలో వారాల వినోద్‌కుమార్**



కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 18 (నవజ్యోతి ప్రతినిధి): వినాయక చవితి నవరాత్రుల సందర్భంగా కొంపల్లి సర్కిల్ పరిధిలోని సాయిబాబానగర్ 292 డివిజన్‌లో గణేష్ ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఉత్సవ కమిటీల ఆహ్వానం మేరకు బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వారాల వినోద్‌కుమార్ పలు గణేష్ మండపాలను సందర్శించి గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులతో కలిసి అన్నప్రసాదం స్వీకరించారు. ఉత్సవ కమిటీ సభ్యులు–స్థానికులతో ముచ్చటించారు. పూజలతో పాటు అన్నదానం వంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో రాజ్‌కుమార్ ముదిరాజ్, రాజు యాదవ్, గట్టు అశోక్, వేణు ముదిరాజ్, కిషోర్, రాజేష్, ఉత్సవ కమిటీ సభ్యులు, మహిళలు–బస్తీవాసులు పాల్గొన్నారు.

## కార్మికుల సేవలు ఎనలేనివి

**చేతివృత్తిదారులు – సాంకేతిక నిపుణుల పాత్ర కీలకం: బండి రమేష్**



కూకట్‌పల్లి, సెప్టెంబర్ 18 (నవజ్యోతి ప్రతినిధి): సమాజ ప్రగతిలో కార్మికులు, చేతివృత్తిదారులు–సాంకేతిక నిపుణుల పాత్ర అత్యంత కీలకమని టీపీసీసీ ఉపాధ్యక్షుడు–నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ బండి రమేష్ అన్నారు. శివాజీనగర్‌లో జై భవాని యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో లక్ష్మణ్ గౌడ్ పర్యవేక్షణలో–తులసీరామ్ నిర్వహణలో నిర్వహించిన విశ్వకర్మ పూజల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. కష్టపడే వారి సేవలను సమాజం గుర్తించి ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. విశ్వకర్మ భగవానుడి ఆశీస్సులతో ప్రజలంతా సుఖసంతోషాలు–ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. అనంతరం స్థానికులు–భక్తులకు అన్నవితరణ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు: లక్ష్మయ్య, వేముల సత్యం, వాజిద్ బాషా, గీత, సునీత, భర్తలే అబ్దుల్లా, అహ్మద్, నరసింహ యాదవ్, నరసింహ గౌడ్, రాజు, స్వామి, నర్సింగ్ యాదవ్, విజయ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారంలో.. నిర్లక్ష్యమా?

## సర్పంచులు చెప్పిన సమస్యలు పట్టవా? – గైర్హాజరైన అధికారులపై నివేదిక

హత్నూర, సెప్టెంబర్ 18 (నవజ్యోతి ప్రతినిధి): గ్రామాల్లో నెలకొన్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం కావడం లేదని సర్పంచులు ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం ఇన్‌చార్జి ఎంపీడీవో యూసుఫ్ అధ్యక్షతన మండల సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గుండ్ల మాచునూర్ సర్పంచ్ శ్రీహరి మాట్లాడుతూ పాఠశాల విద్యార్థులకు అందించిన యూనిఫామ్‌లు కొందరికి చిన్నగా–మరికొందరికి పెద్దగా ఉన్నాయని, వాటిని సరిచేయాలని కోరారు. పరిశ్రమలకు మిషన్ భగీరథ నీటిని సరఫరా చేయడం వల్ల కొన్ని గ్రామాలకు తాగునీటి ఇబ్బందులు ఏర్పడుతున్నాయని సర్పంచులు నవీన్‌గౌడ్, శ్రీహరి పేర్కొన్నారు. గత సమావేశంలో సమస్యను ప్రస్తావించినా చర్యలు తీసుకోలేదని తెలిపారు. పరిశ్రమల నుంచి సీఎస్ఆర్ నిధులు గ్రామపంచాయతీలకు కేటాయించి గ్రామాభివృద్ధికి వినియోగించాలని, ఒక్కో గ్రామపంచాయతీకి రూ.20 లక్షలు కేటాయించాలని కోరారు. సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో తాగునీటి సమస్యతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని వైద్యాధికారి రజిని తెలిపారు. పౌతి మార్పిడికి ప్రభుత్వ ఉద్యోగి సాక్షిగా సంతకం చేయాలనే నిబంధనతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని శ్రీహరి తహసీల్దార్ ఫర్హీన్ షేక్ దృష్టికి తీసుకెళ్లారు. కాసాల గ్రామానికి రెండేళ్లుగా మిషన్ భగీరథ నీరు అందడం లేదని సర్పంచ్ వెంకటేశం తెలిపారు. సమావేశానికి గైర్హాజరైన పలు శాఖల అధికారులపై జిల్లా అధికారులకు




నివేదిక అందజేస్తామని ఇన్‌చార్జి ఎంపీడీవో యూసుఫ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయబ్ తహసీల్దార్ దావూద్ అహ్మద్, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు–వివిధ శాఖల మండల అధికారులు పాల్గొన్నారు.


# నిమజ్జన వేళ.. ట్రాఫిక్ రూట్లు మార్పు!

## సూరారం లింగం చెరువు వద్ద ప్రత్యేక ఆంక్షలు – భారీ వాహనాలకు నో ఎంట్రీ

కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 18 (నవజ్యోతి ప్రతినిధి): గణేష్ నిమజ్జనోత్సవాల నేపథ్యంలో సూరారం కట్టమైసమ్మ చెరువు (లింగం చెరువు) వద్ద ట్రాఫిక్ నియంత్రణకు జీడిమెట్ల ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. సెప్టెంబర్ 18 నుంచి 26 వరకు ప్రతిరోజూ సాయంత్రం 4 గంటల నుంచి మరుసటి రోజు ఉదయం 6 గంటల వరకు ట్రాఫిక్ మళ్లింపులు అమల్లో ఉంటాయని తెలిపారు. బహదూర్‌పల్లి నుంచి సూరారం జంక్షన్ వరకు భారీ వాహనాల రాకపోకలను నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. గండిమైసమ్మ నుంచి జీడిమెట్ల–బాలానగర్ వైపు వెళ్లే భారీ వాహనాలను బహదూర్‌పల్లి జంక్షన్ నుంచి దూలపల్లి గ్రామం ఎన్టీఆర్ విగ్రహం–జీడిమెట్ల ఇండస్ట్రియల్ ఏరియా–షాపూర్‌నగర్ మీదుగా మళ్లించనున్నారు. బాలానగర్–జీడిమెట్ల నుంచి గండిమైసమ్మ వైపు వెళ్లే భారీ వాహనాలను జేఈటీఎల్ నుంచి దూలపల్లి గ్రామం ఎన్టీఆర్ విగ్రహం–బహదూర్‌పల్లి జంక్షన్ మీదుగా మళ్లించనున్నట్లు పోలీసులు తెలిపారు. వాహనదారులు పోలీసుల సూచనలు పాటించి ప్రత్యామ్నాయ మార్గాలను వినియోగించుకోవాలని జీడిమెట్ల ట్రాఫిక్ సీఐ నరసింహారావు కోరారు. ట్రాఫిక్ మళ్లింపుల



సమాచారం కోసం 87126 63584 నంబర్‌ను




సంప్రదించవచ్చని తెలిపారు.

## గణపతి నవరాత్రి ఉత్సవాల్లో మహా అన్నదానం

**మల్లికార్జున్‌నగర్‌లో భక్తిశ్రద్ధలతో నిర్వహణ**



పటాన్‌చెరు, సెప్టెంబర్ 18 (నవజ్యోతి ప్రతినిధి): రామచంద్రాపురం డివిజన్ మల్లికార్జున్‌నగర్ కాలనీలో శక్తి సేన యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఐదో రోజు మహా అన్నదాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై గణనాథుడిని దర్శించుకుని తీర్థప్రసాదాలు–అన్నప్రసాదం స్వీకరించారు. ఈ సందర్భంగా సంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాటా సుధా శ్రీనివాస్‌గౌడ్, భారతీనగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ సింధు ఆదర్శ్‌రెడ్డిని శక్తి సేన యూత్ అసోసియేషన్ సభ్యులు ఘనంగా సన్మానించారు. గణపతి ఉత్సవాలతో పాటు అన్నదానం వంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని వారు అన్నారు. కాలనీవాసుల సహకారంతో కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కాలనీవాసులు, యూత్ సభ్యులు–భక్తులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## వావిలాల పాఠశాలలో బాలికలకు హెచ్‌పీవీ టీకా

**రెండో డోస్ తీసుకున్న 8 మంది బాలికలు – విద్యార్థులకు ఆరోగ్యంపై అవగాహన**




జిన్నారం, సెప్టెంబర్ 18 (నవజ్యోతి ప్రతినిధి): ఫ్యామిలీ ప్లానింగ్ అసోసియేషన్ ఇండియా హైదరాబాద్ బ్రాంచ్ ఆధ్వర్యంలో జిన్నారం మండలం వావిలాల ఉన్నత పాఠశాలలో 9 నుంచి 14 ఏళ్ల బాలికలకు హెచ్‌పీవీ టీకా రెండో డోస్ అందించారు. ఎనిమిది మంది బాలికలు టీకా తీసుకున్నారు. అనంతరం 6 నుంచి 10వ తరగతి విద్యార్థినీ–విద్యార్థులకు ఆరోగ్యం–పౌష్టికాహారం–ఆరోగ్య పరిరక్షణపై అవగాహన సదస్సు నిర్వహించారు. సుమారు 120 మంది విద్యార్థులకు డాక్టర్ నళిని సాధారణ ఆరోగ్య పరీక్షలు నిర్వహించి సమతుల్యమైన పౌష్టికాహారం తీసుకోవడం–వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం వంటి అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ ఆఫీసర్ ప్రశాంత్, యూత్ వాలంటీర్ సార్థిక్, ఏఎన్ఎంలు కుమారి–కవిత, కోఆర్డినేటర్ సురేష్, పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్ఎం రాజారావు, వైవీ శర్మ, ఋషి, రాజిరెడ్డి, జె.లత, పవన్‌రాజు, మాధవి తదితరులు పాల్గొన్నారు.

## భ్రమరాంబిక అమ్మవారికి మూడు తులాల బంగారు నెక్లెస్ సమర్పణ

**రెయిన్బో మెడోస్ బీరంగూడందిన వి.శ్రీధర్‌కుమార్ కుటుంబ సభ్యుల భక్తి కానుక**



పటాన్‌చెరు, సెప్టెంబర్ 18 (నవజ్యోతి ప్రతినిధి): పటాన్‌చెరు నియోజకవర్గం బీరంగూడ గుట్టపై ఉన్న శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవాలయంలో కొలువైన శ్రీ భ్రమరాంబిక అమ్మవారికి రెయిన్బో మెడోస్ బీరంగూ డకు చెందిన వి. శ్రీధర్‌కుమార్ కుటుంబ సభ్యులు మూడు తులాల బంగారు నెక్లెస్‌ను భక్తిశ్రద్ధలతో కానుకగా సమర్పించారు. ఆలయ చైర్మన్ సుధాకర్ యాదవ్, ఆలయ అధికారుల సమక్షంలో నెక్లెస్‌ను ప్రధాన అర్చకులు ప్రహ్లాద్ కు అందజేశారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తుల విశ్వాసానికి ప్రతీకగా ఇలాంటి కానుకలు నిలుస్తాయని, ఆలయ అభివృద్ధి–భక్తుల సౌకర్యాల కోసం భక్తుల సహకారం అభినందనీయమని చైర్మన్ సుధాకర్ యాదవ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, అర్చకులు, సిబ్బంది–భక్తులు పాల్గొన్నారు.

## ఆకాశ వర్ణంలో దర్శనమిచ్చిన శ్రీ సిద్ధి వినాయక స్వామి

**ఐదో రోజు ప్రత్యేక అలంకరణలో స్వామివారి దర్శనం**



పటాన్‌చెరు (రుద్రారం), సెప్టెంబర్ 18 (నవజ్యోతి ప్రతినిధి): శ్రీ గణేష్ గడ్డ సిద్ధి గణపతి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఐదో రోజు శ్రీ సిద్ధి వినాయక స్వామివారు ఆకాశ వర్ణ ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారి అలంకరణను దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవాల సందర్భంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో లావణ్య, ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు పట్లోళ్ల లక్ష్మారెడ్డి, కె. సాయి గణేష్, ఎన్. సతీష్‌కుమార్, ఏ. మురళిగౌడ్, ఏ. సంతోష్, ఏ. ప్రభు, బి. శివరాములు, ఏ. రాజేష్‌గౌడ్, ఏ. ముకుందరెడ్డి, సి. నారాయణరెడ్డి, డి. మహేష్, ఏ. కృష్ణ, ఆర్. శ్రీనివాస్, ఎం. రత్న తదితరులు పాల్గొన్నారు.

## పెయింటింగ్ కార్మికులకు ప్రభుత్వాలు అండగా నిలవాలి



పటాన్‌చెరు (గుమ్మడిల), సెప్టెంబర్ 18 (నవజ్యోతి ప్రతినిధి): పెయింటింగ్ కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వాలు అండగా నిలిచి వారి సమస్యలను పరిష్కరించాలని శ్రీ మల్లికార్జున పెయింటింగ్ యూనియన్ మండల అధ్యక్షుడు గోమని కృష్ణవంశీ కోరారు. గుమ్మడిదల మండల పరిధిలోని పెయింటింగ్ కార్మికులు శ్రీ మల్లికార్జున పెయింటింగ్ యూనియన్‌ను ఏర్పాటు చేసుకోగా, శుక్రవారం యూనియన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయిన సందర్భంగా జిల్లా నాయకులు దావీద్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణవంశీ మాట్లాడుతూ కార్మికులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని, వారి హక్కులు–సంక్షేమం కోసం యూనియన్ తరపున నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. యూనియన్ నూతన కార్యవర్గంలో ప్రధాన కార్యదర్శిగా కే. సురేష్, ఉపాధ్యక్షులుగా ఆర్. నరసింహ, కార్యనిర్వహణ అధ్యక్షుడిగా వెంకట్, కోశాధికారిగా సాయి కుమార్, సహాయ కార్యదర్శిగా వెంకటస్వామి, ఆర్గనైజర్‌గా నందం శివకుమార్ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో యూనియన్ సభ్యులు–పెయింటింగ్ కార్మికులు పాల్గొన్నారు.

## మహిళా సమాఖ్య భవన నిర్మాణ పనులకు శ్రీకారం

**రూ.10 లక్షల అంచనా వ్యయంతో భవన నిర్మాణం ప్రారంభం**



బిక్కనూర్, సెప్టెంబర్ 18 (నవజ్యోతి ప్రతినిధి): బిక్కనూర్ మండలం రామేశ్వర్‌పల్లి గ్రామంలో సుమారు రూ.10 లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న మహిళా సమాఖ్య భవన నిర్మాణ పనులకు శుక్రవారం శ్రీకారం చుట్టారు. పీఏసీఎస్ చైర్మన్ బద్దం ఇంద్రకరణ్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై భూమిపూజ నిర్వహించి పనులను ప్రారంభించారు. మహిళా సంఘాల సమావేశాలు—శిక్షణా కార్యక్రమాలు—ఇతర కార్యకలాపాలకు ఈ భవనం ఉపయోగపడుతుందని, మహిళల ఆర్థిక—సామాజిక సాధికారతకు దోహదపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిక్కనూర్ ఎంపీడీవో సవితారెడ్డి, సర్పంచ్ చేపూరి రాణిరాజు, ఉపసర్పంచ్ గొల్లపల్లి వినోద్‌గౌడ్, వీడీసీ అధ్యక్షుడు మద్ది సూర్యకాంత్‌రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, ఐకేపీ ఏపీఎం సాయన్న, సీసీ శ్రీనివాస్, వార్డు సభ్యులు కృష్ణారెడ్డి, రమేష్, సులోచన రమేష్, పంచాయతీ కార్యదర్శి శ్యామ్, లైన్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌గౌడ్, కాంట్రాక్టర్ మురళి, మహిళా సంఘాల కార్యవర్గ సభ్యులు, సీఏలు—మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## నిమజ్జన వేడుకల్లో డీజేలు పెడితే కఠిన చర్యలు

**నిబంధనలు ఉల్లంఘిస్తే సామగ్రి సీజ్—కేసులు: ఎస్సై మధుకర్‌రెడ్డి**



శివ్వంపేట, సెప్టెంబర్ 17 (నవజ్యోతి ప్రతినిధి ఆకుల శ్రీనివాస్): వినాయక నిమజ్జన వేడుకలను భక్తిశ్రద్ధలతో—ప్రశాంతంగా నిర్వహించుకోవాలని మెదక్ జిల్లా శివ్వంపేట ఎస్సై మధుకర్‌రెడ్డి కోరారు. మండల పరిధిలోని డీజే—సౌండ్ సిస్టమ్ నిర్వాహకులకు గురువారం పోలీస్‌స్టేషన్‌లో కౌన్సెలింగ్ నిర్వహించి బైండోవర్ చేశారు. సుప్రీంకోర్టు ఆదేశాలు—ప్రభుత్వ నిబంధనల ప్రకారం వినాయక శోభాయాత్రలు—నిమజ్జన ఊరేగింపుల్లో డీజేల వినియోగం నిషేధమని తెలిపారు. నిబంధనల మేరకు అనుమతించిన తక్కువ శబ్దంతో కూడిన మైక్ సెట్లను మాత్రమే వినియోగించాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించి డీజేలు ఏర్పాటు చేస్తే సామగ్రిని సీజ్ చేయడంతో పాటు డీజే నిర్వాహకులు—వినాయక మండపాల నిర్వాహకులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా యువత—ఉత్సవ కమిటీలు పోలీసులకు సహకరించి వేడుకలను ప్రశాంతంగా నిర్వహించాలని కోరారు.

## హాస్టల్ గదిలో విద్యార్థి మృతి

**విద్యార్థి మృతికి కారణమేంటి? — తండ్రి ఫిర్యాదుతో కేసు నమోదు**



కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 18 (నవజ్యోతి ప్రతినిధి): దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బహదూర్‌పల్లిలో వారాహి బాయ్స్ హాస్టల్‌లో బీటెక్ విద్యార్థి సాయిచరణ్ (20) మృతిచెందాడు. మల్లారెడ్డి యూనివర్సిటీ మైసమ్మగూడలో బీటెక్ మూడో సంవత్సరం చదువుతున్న సాయిచరణ్ కొంతకాలంగా హాస్టల్‌లో ఉంటున్నట్లు పోలీసులు తెలిపారు. గురువారం రాత్రి స్నేహితులు సినిమాకు వెళ్లగా సాయిచరణ్ హాస్టల్ గదిలోనే ఉన్నాడు. అర్ధరాత్రి తిరిగి వచ్చిన స్నేహితులు తలుపు కొట్టినా స్పందన లేకపోవడంతో నిద్రపోయారు. శుక్రవారం ఉదయం కూడా తలుపు తీయకపోవడంతో అనుమానంతో తలుపు తెరిచి చూడగా సాయిచరణ్ మృతిచెందినట్లు గుర్తించారు. సమాచారం అందుకున్న దుండిగల్ పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. సాయిచరణ్ తండ్రి శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. విద్యార్థి మృతికి దారితీసిన పరిస్థితులు పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది.

## బాచుపల్లిలో గుర్తుతెలియని వ్యక్తి మృతి

**ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి — వివరాల కోసం పోలీసుల ఆరా**



కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 18 (నవజ్యోతి ప్రతినిధి): బాచుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో గుర్తుతెలియని వ్యక్తి చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోలీసుల వివరాల ప్రకారం ఈ నెల 14న ఉదయం సుమారు 10 గంటలకు బాచుపల్లిలోని సిల్వర్ ఓక్స్ స్కూల్ గేట్ వద్ద 35–40 ఏళ్ల వయస్సున్న వ్యక్తి ఫిట్స్ వచ్చి పడిపోయాడు. సమాచారం అందుకున్న బాచుపల్లి పోలీసులు అతడిని గాంధీ ఆసుపత్రికి తరలించి చికిత్స అందేలా చేశారు. అయితే ఈ నెల 17న చికిత్స పొందుతూ మృతిచెందినట్లు వైద్యులు పోలీసులకు తెలిపారు. మృతుడి వివరాలు తెలియకపోవడంతో గుర్తింపు కోసం పోలీసులు ఆరా తీస్తున్నారు. మృతుడి ఎత్తు సుమారు 5 అడుగులు, చామనచాయ, నల్లటి జుట్టు కలిగి ఉండగా పసుపు రంగు స్లీవ్‌లెస్ బనియన్, నీలం రంగు జీన్స్ ప్యాంటు ధరించి ఉన్నాడు. మృతుడి గురించి సమాచారం తెలిసిన వారు బాచుపల్లి పోలీసులను సంప్రదించాలని పోలీసులు కోరారు.

## అన్నదానం మహాదానం— మాజీ సర్పంచ్ కె. రాజిరెడ్డి



దోమ, సెప్టెంబర్ 18 (నవజ్యోతి ప్రతినిధి): దోమ మండల కేంద్రంలోని మొదటి వార్డులో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద స్థానిక కాలనీ యువత—శ్రీరామసేన యూత్ ఆధ్వర్యంలో శుక్రవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ సర్పంచ్ కె. రాజిరెడ్డి, వార్డు సభ్యుడు మైనొద్దీన్, మహిళలు, నిర్వాహకులు—స్థానిక పెద్దలు హాజరై భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కె. రాజిరెడ్డి మాట్లాడుతూ అన్నదానం అన్ని దానాల్లోకెల్లా గొప్పదని, భక్తి—సేవాభావంతో నిర్వహించే అన్నదాన కార్యక్రమాలు సమాజంలో మానవత్వాన్ని పెంపొందిస్తాయని అన్నారు.

# కాప్రా ప్రెస్ క్లబ్‌లో కోలాహలంగా గణనాథుని నిమజ్జనం

**ఐదు రోజుల పూజలకు ముగింపు — వేలం పాటలో లడ్డూకు రూ.12,811**

కాప్రా, సెప్టెంబర్ 18 (నవజ్యోతి ప్రతినిధి): కాప్రా ప్రెస్ క్లబ్‌లో ఐదు రోజుల పాటు భక్తిశ్రద్ధలతో పూజలందుకున్న ఐదు అడుగుల మట్టి గణనాథుని నిమజ్జన కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఐదో రోజు ప్రత్యేక పూజలు—ఉద్వాసన పూజలు నిర్వహించిన అనంతరం గణనాథుడిని ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై ఊరేగింపుగా కాప్రా చెరువు వద్దకు తరలించి నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన వేలం పాటలో క్లబ్ ఉపాధ్యక్షుడు గోవిందుకుంట్ల ఆంజనేయులు స్వామివారి లడ్డూను రూ.12,811కు, క్లబ్ సభ్యుడు గంగి కృష్ణ కండువా—పంచెను రూ.916కు, క్లబ్ సలహాదారు బెలిదె అశోక్ మూడు పూలదండలను రూ.316కు దక్కించుకున్నారు. మేళతాళాలు—భాజాభజంత్రీల మధ్య సాగిన ఊరేగింపులో భక్తులు గణనాథుని నామస్మరణ చేస్తూ ఉత్సాహంగా పాల్గొన్నారు. దీంతో కాప్రా ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన గణేష్ నవరాత్రి ఉత్సవాలు నిమజ్జనంతో ముగిశాయి. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు మెరుగు చంద్ర మోహన్, సలహాదారులు బెలిదె అశోక్, ఎంపల్లి పద్మారెడ్డి, మాజీ అధ్యక్షులు శనిగరం అశోక్, పటేల్ నరసింహ, మాజీ కోశాధికారి యాట రాజు, ప్రధాన కార్యదర్శి ముత్యం ముఖేష్‌గౌడ్, ఉపాధ్యక్షులు యావాపురం రవి, గోవిందుకుంట్ల ఆంజనేయులు, దొమ్మాటి కిరణ్‌కుమార్, కోశాధికారి రామచంద్రమూర్తి, ఆర్గనైజింగ్ కార్యదర్శులు వెంకట్, ఓ.నరసింహ, కార్యవర్గ సభ్యులు తొడుపునూరు బాలకృష్ణ, నరేష్



నాయి, పలుగుల పవన్, బసంతరెడ్డి, సాంబశివుడు తదితరులు పాల్గొన్నారు.

## దేవనోనిగూడెంలో రహదారి వెంట ఎల్ఈడీ వీధి దీపాల ఏర్పాటు

**రాత్రివేళల్లో రహదారి భద్రతకు చర్యలు**



పరిగి, సెప్టెంబర్ 18 (నవజ్యోతి ప్రతినిధి): పూడూరు మండలం దేవనోనిగూడెం గ్రామపంచాయతీ పరిధిలో గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో శుక్రవారం ఎల్ఈడీ వీధి దీపాల ఏర్పాటు కార్యక్రమం చేపట్టారు. బీజాపూర్ హైవే దేవనోనిగూడెం గేట్ నుంచి గ్రామానికి వెళ్లే రహదారి వెంట వీధి దీపాలను ఏర్పాటు చేశారు. గ్రామ ప్రజల సౌకర్యంతో పాటు రాత్రివేళల్లో రహదారి భద్రతను దృష్టిలో ఉంచుకుని దీపాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గ్రామానికి అవసరమైన మౌలిక వసతుల కల్పనలో భాగంగా ఈ కార్యక్రమం చేపట్టినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ యు. నిర్మల నారాయణ, ఉపసర్పంచ్ యు. భాస్కర్, గ్రామపంచాయతీ కార్యదర్శి వీమారెడ్డి, కేరవెలి సర్పంచ్ కె. రాంచంద్రయ్య, వార్డు సభ్యులు శ్రావ్య, రాంచంద్రయ్య, శిల్ప, ప్రకాష్, అంజయ్య, దస్తయ్య, గ్రామ పెద్దలు—యువకులు పాల్గొన్నారు.

## కీసరలో యువకుడి అదృశ్యం

**15 రోజులుగా ఆచూకీ కోసం కుటుంబ సభ్యుల ఎదురుచూపులు**




కీసర, సెప్టెంబర్ 18 (నవజ్యోతి ప్రతినిధి): మేడ్చల్—మల్కాజ్‌గిరి జిల్లా కీసర పోలీస్‌స్టేషన్ పరిధిలో గంధమాల అజయ్‌కుమార్ (21) సెప్టెంబర్ 3న అదృశ్యమై 15 రోజులు గడుస్తున్నా ఆచూకీ లభించకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. సెప్టెంబర్ 4న కీసర పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసినప్పటికీ ఇప్పటివరకు ఆచూకీ లభించలేదని కుటుంబ సభ్యులు తెలిపారు. ఫోన్ లొకేషన్, సీసీ కెమెరాల దృశ్యాలు, కాల్ వివరాలు, స్నేహితులు—పరిచయస్తుల సమాచారాన్ని పరిశీలించి దర్యాప్తును వేగవంతం చేయాలని కోరారు. దర్యాప్తుపై ఎస్ఐ జ్ఞానేందర్‌రెడ్డి ఆశించిన స్థాయిలో స్పందించడం లేదని కుటుంబ సభ్యులు ఆరోపించగా, దీనిపై పోలీసుల అధికారిక స్పందన తెలియాల్సి ఉంది. విషయం తెలుసుకున్న కీసర మండల సామాజిక కార్యకర్త తుడుం శ్రీనివాస్ అజయ్‌కుమార్ కుటుంబాన్ని పరామర్శించి, ఆచూకీ త్వరగా లభించేలా అధికారుల దృష్టికి తీసుకెళ్లి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. శుక్రవారం కమిషనర్ సుమతిని కలిసి దర్యాప్తును వేగవంతం చేయాలని కోరనున్నట్లు శ్రీనివాస్ తెలిపారు.

## హరీశ్వర్‌రెడ్డి వర్ధంతికి ఘన నివాళులు



పరిగి, సెప్టెంబర్ 18 (నవజ్యోతి ప్రతినిధి): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ స్పీకర్ హరీశ్వర్‌రెడ్డి మూడో వర్ధంతి సందర్భంగా మంచన్‌పల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు ఘన నివాళులు అర్పించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం నాయకులు మాట్లాడుతూ పరిగి ప్రాంత అభివృద్ధి—ప్రజల సంక్షేమం కోసం హరీశ్వర్‌రెడ్డి చేసిన కృషి చిరస్మరణీయమని అన్నారు. ప్రజా జీవితంలో ఆయన అందించిన సేవలను ఎప్పటికీ గుర్తుంచుకుంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మంచన్‌పల్లి గ్రామ బీఆర్ఎస్ నాయకులు రామిరెడ్డి, ఆనంద్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## మధు యాష్కీని కలిసిన కాంగ్రెస్ నాయకులు



కీసర, సెప్టెంబర్ 18 (నవజ్యోతి ప్రతినిధి): ఆల్ ఇండియా ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ పార్టీ చైర్మన్‌గా నియమితులైన మాజీ ఎంపీ—టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధు యాష్కీని కాంగ్రెస్ నాయకులు శుక్రవారం ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా టీపీసీసీ రాష్ట్ర ఎస్సీ విభాగం వైస్ చైర్మన్ డాక్టర్ గడ్డం శ్రీనివాస్, ఓబీసీ విభాగం చైర్మన్ జవహర్‌నగర్ పసుపులేటి వీరభాస్కర్‌రావు, జిల్లా ఎస్సీ విభాగం కన్వీనర్ మొగిలిపాక వెంకటేష్ తదితరులు మధు యాష్కీని శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు. అనంతరం పార్టీ భవిష్యత్ కార్యక్రమాలు—అనుబంధ సంఘాల సమన్వయంతో కాంగ్రెస్‌ను మరింత బలోపేతం చేసే అంశాలపై చర్చించారు. పార్టీ సిద్ధాంతాలు—ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు సమన్వయంతో పనిచేయాలని నిర్ణయించినట్లు నాయకులు తెలిపారు.

## బోడుప్పల్‌లో అక్రమ షెడ్లపై సెటిలర్స్ ఫోరం ఆగ్రహం



ఫ్రీ విలేజ్ ఎదుట అనుమతులు లేకుండా నిర్మాణాలు జరుగుతున్నాయంటూ ఆరోపణలు

బోడుప్పల్, సెప్టెంబర్ 18 (నవజ్యోతి ప్రతినిధి): మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బోడుప్పల్ సర్కిల్‌లో అక్రమ నిర్మాణాలపై సెటిలర్స్ ఫోరం ఆందోళన వ్యక్తం చేసింది. ఫ్రీ విలేజ్ కాలనీ ఎదురుగా అనుమతులు లేకుండా అక్రమ షెడ్లు నిర్మిస్తున్నారని ఫోరం ప్రతినిధులు ఆరోపించారు. నిర్మాణాలు కొనసాగుతున్నా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవడం లేదని పేర్కొన్నారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న షెడ్లతో ప్రభుత్వ ఆదాయానికి నష్టం వాటిల్లే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. అనుమతులు లేకుండా నిర్మిస్తున్న షెడ్లను పరిశీలించి నిబంధనల ప్రకారం తక్షణమే చర్యలు తీసుకోవాలని సర్కిల్ డిప్యూటీ కమిషనర్—పట్టణ ప్రణాళిక అధికారులను కోరారు. అధికారులు స్పందించకపోతే మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌తో పాటు రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని సెటిలర్స్ ఫోరం ప్రతినిధులు తెలిపారు.

## వినాయక మండపాలను సందర్శించిన మాజీ కార్పొరేటర్ సింగిరెడ్డి పద్మారెడ్డి

**అన్నప్రసాద వితరణ కార్యక్రమాల్లో పాల్గొన్న ప్రముఖులు**



బోడుప్పల్, సెప్టెంబర్ 18 (నవజ్యోతి ప్రతినిధి): మేడ్చల్—మల్కాజిగిరి జిల్లా బోడుప్పల్ సర్కిల్‌లో వినాయక నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ సింగిరెడ్డి పద్మారెడ్డి పలు వినాయక మండపాలను సందర్శించారు. ఎన్ఐఎన్ కాలనీ రోడ్ నంబర్—4లోని వినాయక మండపం వద్ద నిర్వహించిన అన్నప్రసాద వితరణ కార్యక్రమానికి మాజీ కార్పొరేటర్లు సింగిరెడ్డి పద్మారెడ్డి—తోటకూర అజయ్‌యాదవ్ ముఖ్య అతిథులుగా హాజరై గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు అన్నప్రసాదాన్ని వడ్డించారు. గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నప్రసాద వితరణలోనూ పాల్గొని భక్తులు—కాలనీవాసులకు అన్నప్రసాదం అందించారు. ఈ కార్యక్రమాల్లో మేడ్చల్ జిల్లా బి—బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్‌గౌడ్, బోడుప్పల్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు బొమ్మక కళ్యాణ్, చెంగిచెర్ల డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు పోగుల దిలీప్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్లు, కాంగ్రెస్ నాయకులు, గంగపుత్ర సంఘం సభ్యులు, డివిజన్ నాయకులు, కాలనీవాసులు—భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.